ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024



మార్కెట్‌కు క్రిస్మస్ కళ

- కిటకిటలాడిన రహదారులు

క్రిస్మస్ పండగ షాపింగ్‌తో నగరంలోని ప్రధాన ప్రాంతాలు ఆదివారం రద్దీని సంతరించుకున్నాయి. డాబాగార్డెన్స్, ద్వారకానగర్, జగదాంబ తదితర ప్రాంతాల్లోని వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ కిటకిటలాడాయి. సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు ప్రధాన రహదారులు, మాల్స్ కిక్కిరిసిపోయాయి. మరో రెండు రోజులు ఇదే రద్దీ కొనసాగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మరో వైపు కీలక ప్రాంతాలు, కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జగదాంబ, డాబాగార్డెన్స్, వీఐపీరోడ్డు, ద్వారకానగర్ ప్రాంతాల్లో వాహనాలు బారులు తీరాయి. సెలవు దినం కావడంతో బీచ్‌కు సందర్శకులు పోటెత్తారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఏయూపై ఫోకస్

గత వీసీ ప్రసాదరెడ్డి అడ్డగోలు వ్యవహారాలపై విచారణకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

- 'ఆంధ్రజ్యోతి' కథనాలపై ఆరా తీసిన విద్యాశాఖ మంత్రి కార్యాలయం
- ఇప్పటికే సమగ్ర సమాచారాన్ని సేకరించిన మంత్రి లోకేశ్
- నెలాఖరులోగా విచారణ కమిటీని నియమిస్తారని ప్రచారం

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్ర యూనివర్సిటీని అడ్డగోలుగా వ్యవహారాలకు కేంద్రంగా మార్చిన గత వీసీ, ఇతర ఉన్నతాధికారులపై విచారణకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు వర్సిటీపై ఉన్నత విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు చెబుతున్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆరా తీసినట్టు చెబుతున్నారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నట్టు సమాచారం.



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా వ్యవహరించి వర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరించి మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేపడతామని కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు వీసీ కార్యాలయం ఎదుటే మీడియాకు వెల్లడించారు. దీంతో ఐదేళ్లుగా మాజీ వీసీ తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చాలామంది ఆనందం వ్యక్తం చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా వర్సిటీలోని అక్రమాలపై కనీస విచారణ లేకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నత విద్యాశాఖ కార్యాలయం వేగంగా స్పందిస్తున్నట్టు చెబుతున్నారు. తాజాగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ నియామక ప్రక్రియను పూర్తిచేయడంతో ఏయూ వ్యవహారాలపై విచారణకు ఆదేశిస్తారంటున్నారు. ఈ నెలాఖరు నాటికి విచారణ కమిటీని నియమించే అవకాశాలున్నట్టు వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యాలయం నుంచి సూచాయగా సమాచారం అందిందంటున్నారు. విచారణకు సంబంధించిన కమిటీ ఏర్పాటుపై ఉన్నత విద్యా మండలి చైర్మన్, మంత్రి కార్యాలయ అధికారులు రెండు, మూడు రోజుల్లో సమావేశం కాబోతున్నట్టు సమాచారం

ఫిర్యాదుల పరంపర..

ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలి, వేధింపులతో ఇబ్బందులు పడిన ఉద్యోగులు నేరుగా మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదులు చేశారు. ఇటీవల ప్రజా దర్బార్‌లో మంత్రిని కలిసి వివరించినట్టు చెబుతున్నారు. ఈ జాబితాలో ఓ సీనియర్ ప్రొఫెసర్‌తోపాటు మరో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులు ఉన్నారని తెలిసింది. విచారణ కమిటీని నియమిస్తే తమ గోడు వెళ్లబోసుకునేందుకు మరింతమంది సిద్ధంగా ఉన్నారంటున్నారు. కాగా ఏయూ

... మిగతా 6వ పేజీలో

అడవి... అంతరిస్తోంది

ఉమ్మడి జిల్లాలో 116.07 చ.కి.మీ. తగ్గిన విస్తీర్ణం

- అల్లూరి జిల్లాలో అత్యధికంగా తగ్గుదల
- అటవీ అగ్నిప్రమాదాల్లో దేశంలోనే ఈ జిల్లా రెండోస్థానం
- అర్బన్ అడవుల విస్తీర్ణంలో ఏపీలో విశాఖ ప్రథమం

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలో అడవులు వేగంగా అంతరిస్తున్నాయి. 2021తో పోల్చితే 2023లో 116.07 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం తగ్గింది. అందులో ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 101.69 చదరపు కిలోమీటర్ల మేర అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. రాష్ట్రంలో మొత్తం 138.66 చ.కి.మీ.ల మేర అడవులు తగ్గగా, వాటిలో 101 చ.కి.మీ. అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

అనకాపల్లి జిల్లాలో 9.62 చ.కి.మీ.లు, విశాఖపట్నంలో 4.72 చ.కి.మీ. వెరసి ఉమ్మడి జిల్లాలో 116.07 చ.కి.మీ. విస్తీర్ణం తగ్గినట్టు అటవీ నివేదిక -2023 (ఇండియా స్టేట్‌ఆఫ్ ఫారెస్టు రిపోర్టు) వెల్లడించింది. ఈ నివేదికను కేంద్ర అటవీ , పర్యావరణ మంత్రి భూపేందర యాదవ్ శనివారం విడుదల చశారు.

అడవుల విస్తీర్ణం, చెట్లు, ఇతర అంశాలను 2021తో పోల్చుతూ 2023లో చేపట్టిన సర్వే నివేదిక ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా విస్తీర్ణం 12,446.54 చ.కి.మీ.లు కాగా, అందులో అత్యంత దట్టమైన అడవులు 1,173.18 చ.కి.మీ.లు, మధ్యస్థాయి అడవులు 3,781.97, ఓపెన్ అడవులు 1,952.17 వెరసి 6,917.32 చ.కి.మీలు (55.58శాతం) విస్తరించి ఉన్నాయి. మరో 726.83 చ.కి.మీ.లు పొదలు, డొంకలతో నిండి ఉంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి దేశంలో అటవీ విస్తీర్ణాన్ని ఫారెస్టు సర్వే విభాగం సర్వేచేస్తోంది. 2021 నివేదికతో పోల్చితే అల్లూరి సీతారామరాజు జిల్లాలో 101.69 చ.కి.మీ. మేర అటవీ విస్తీర్ణం తగ్గింది. అనకాపల్లి జిల్లాలో 3,847.88 చ.కి.మీ. జిల్లా విస్తీర్ణం కాగా దాంట్లో దట్టమైన అడవులు లేవు. మధ్యస్థాయి అటవీ విస్తీర్ణం 155.02 చ.కి.మీ.లు, ఓపెన్ అడవులు 551.29చ.కి.మీ.లు వెరసి 706.31 (18.36శాతం) చ.కి.మీలు మేర విస్తీర్ణం ఉండగా, 2021తో పోల్చితే 9.62 చ.కి.మీ.లు తగ్గింది. విశాఖపట్నం జిల్లాలో 952.40 చ.కి.మీ. జిల్లా విస్తీర్ణం కాగా అత్యంత దట్టమైన అడవులు లేవు. మధ్యస్థాయి అడవులు 99.03, ఓపెన్ అటవీ విస్తీర్ణం 173.42 చ.కి.మీలు వెరసి 272.45 (28.61శాతం) చ.కి.మీ.లు విస్తీర్ణం ఉండగా 4.21 చ.కి.మీలు పొదలు, డొంకలతో కూడిన పచ్చదనం ఉంది. దీంట్లో 2021తో పోల్చితే 4.76 చ.కి.మీ.లు తగ్గింది. జిల్లా

... మిగతా 6వ పేజీలో



జీవీఎంసీకి జాతీయ అవార్డు

- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఉత్తమ నగరంగా గుర్తింపు
- రాయ్‌పూర్‌లో అందుకున్న అదనపు కమిషనర్ రమణమూర్తి


ఎంపీ నందకుమార్‌సాయి నుంచి నుంచి అవార్డు అందుకుంటున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత, చెత్త విభజన, సింగిల్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో జీవీఎంసీ జాతీయస్థాయి ఉత్తమ నగరంగా ఎంపికైంది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) 46వ జాతీయస్థాయి సదస్సు ఈనెల 21న ఛత్తీస్‌గడ్ రాజధాని రాయ్‌పూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు అవగాహన కల్పించడంలో కృషిచేస్తున్న పట్టణ స్థానిక సంస్థల పనితీరును పీఆర్ఎస్ఐ సర్వే చేసింది. జీవీఎంసీ పరిధిలో గత ఏడాది ఎకో-వైజాగ్, స్వచ్ఛసర్వేక్షణ్, సీజనల్ వ్యాధుల నియంత్రణ, చెత్త విభజన, నీటిపొదుపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరచడంలో విశేష కృషి చేస్తున్నట్టు గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ నగరంగా ఎంపిక చేశారు. రాయ్‌పూర్‌లో జరిగిన సదస్సులో జాతీయ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, ఎంపీ నందకుమార్‌సాయి చేతుల మీదుగా జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, పీఆర్ఓ నాగేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ దక్షిణభారత అధ్యక్షుడు యూఎస్‌శర్మ పాల్గొన్నారు.


బస్సులు ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జేసీ మయూర్ అశోక్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర

అవసరం మేరకు ఆర్టీసీ సర్వీసులు

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్
- మద్దిలపాలెంలో కొత్త బస్సుల ప్రారంభం

మద్దిలపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రయాణికుల అవసరం మేరకు బస్సు సర్వీసులకు అందుబాటులోకి తెస్తామని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ తెలిపారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో ఆదివారం ఆయన నాలుగు కొత్త బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి సుమారు రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుంటుందన్నారు. మెరుగైన వైద్య సదుపాయాలు అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు సదుపాయం అందుబాటులోకి వస్తుందని, ఇందకోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది కండక్టర్లు, డ్రైవర్లకు మంత్రి పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, డీటీసీ ఆదినారాయణ, జేసీ మయూర్ అశోక్, ఆర్టీసీ అధికారులు ఎ.విజయకుమార్, బి.అప్పలనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వీర్యానికి కుట్ర

క్వాలిటీ సర్కిల్ పోటీల్లో పాల్గొనేందుకు నిధులు లేవట

- ఇప్పటికే నమూనాలు రూపొందించిన ఉద్యోగులు
- రాకపోకల ఖర్చులు ఇవ్వలేమన్న యాజమాన్యం
- కర్మాగారానికి జాతీయస్థాయిలో పేరు రావడం ఇష్టం లేకేనని ఉద్యోగుల ఆరోపణ
- సీఎండీ విమాన టికెట్లకు విచ్చలవిడి ఖర్చుపై ఆగ్రహం
- మరోవైపు ఇప్పటికీ అందని నవంబరు వేతనాలు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు ఏదో విధంగా చెడ్డ పేరు తెచ్చి దానిని మూసివేయించడానికి యాజమాన్యం యత్నిస్తున్నదనే ఆరోపణలు ఉద్యోగ, కార్మిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ప్లాంటు ఆర్థిక పరిస్థితి బాగున్నప్పటికీ ఉద్యోగులకు ఉద్దేశపూర్వకంగా జీతాలు చెల్లించడం లేదు. డిసెంబరు నెల మరో పది రోజుల్లో ముగిసిపోతుంది. అయినా నవంబరు జీతాలు ఇప్పటివరకూ ఇవ్వలేదు. సెప్టెంబరు, అక్టోబరు బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. మరో వైపు క్వాలిటీ సర్కిల్ పోటీలకు పంపేందుకు నిధులు లేవని చేతులెత్తేయడంపై ఉద్యోగ వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులకు తరచూ క్వాలిటీ సర్కిల్ పోటీలు జరుగుతుంటాయి. ఆయా విభాగాల ఉద్యోగులు నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి అవసరమైన నమూనాలు రూపొందించి పోటీల్లో ప్రదర్శిస్తారు. విజేతలకు బంగారు, వెండి పతకాలు ఇచ్చి సత్కరిస్తారు. వీటి వల్ల ఆయా సంస్థలకు మార్కెట్‌లో రేటింగ్ పెరుగుతుంది. గతంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఇలాంటి పోటీలు ఎక్కడ జరిగినా పాల్గొని అవార్డులు సాధించేది. త్వరలో గ్వాలియర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. అందులో పాల్గొనేందుకు వీలుగా ఉక్కులో పలు విభాగాలు దరఖాస్తు చేసి, నమూనాలు రూపొందించాయి. గ్వాలియర్ వెళ్లి, రావడానికి అయ్యే ఖర్చులకు డబ్బులు కావాలని యాజమాన్యాన్ని సంప్రతిస్తే, ముందు ఓకే చేసి, ఆ తరువాత నిధులు లేవని, పోటీలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పింది. దాంతో ఉద్యోగ వర్గాలు ఒక్కసారిగా నిరాశకు గురయ్యాయి. ఇన్ని దశాబ్దాల చరిత్రలో పోటీల్లో పాల్గొనడానికి నిధులు

... మిగతా 6వ పేజీలో

నగరంలో వైట్‌టాప్ రోడ్లు!

తారురోడ్డుకి బదులుగా జీవీఎంసీ కొత్త ఆలోచన

- ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు
- తొలిదశలో 25 కిలోమీటర్లు వేసే యోచన
- గ్లోబల్‌టెండర్ విధానం అమలుకు నిర్ణయం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో బ్లాక్‌టాప్ (తారురోడ్డు) స్థానంలో వైట్‌టాప్ (సిమ్మెంట్ కాంక్రీట్‌మిక్స్) రోడ్లు రాబోతున్నాయి. రోడ్ల నిర్వహణను మెరుగుపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణ స్థానిక సంస్థల్లోనూ ముఖ్యమైన రోడ్ల నిర్వహణను ఇకపై గ్లోబల్ టెండర్ ద్వారా పెద్ద సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో మొదటిదశలో 25 కిలోమీటర్ల మేర ప్రధానరోడ్లను వైట్‌టాప్‌రోడ్లుగా మార్చనున్నారు.



జీవీఎంసీలో 30 అడుగులు, అంతకంటే ఎక్కువ వెడల్పుకలిగిన ముఖ్యమైన రోడ్లు సుమారు 250 కిలోమీటర్లు మేర విస్తరించి ఉన్నాయి. ఆయా రోడ్లు పాడైపోయినా, గుంతలు పడినా జీవీఎంసీ టెండర్ల ద్వారా నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. పాడైన రోడ్లపై కొత్తగా తారులేయరు వేయడానికి, గుంతలు పూడ్చడానికి ఏటా సగటున రూ.వంద కోట్లు ఖర్చు చేస్తోంది. ఆయా పనులు చేపట్టడానికి స్లైచ్‌లవారీగా టెండరు పిలిచి తక్కువకు (ఎల్1) కోట్‌చేసిన కాంట్రాక్టర్‌కు అప్పగిస్తోంది. అయితే చాలామంది కాంట్రాక్టర్ల వద్ద తారురోడ్డు నిర్మాణానికి అవసరమైన యంత్రాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్న వాటిని అద్దెకు తీసుకుని పనులు పూర్తిచేస్తున్నారు. దీనివల్ల రోడ్ల నిర్మాణం ఒకేరీతిలో లేకపోవడం, ఎడ్జ్‌లను సక్రమంగా రోలింగ్ చేయలేకపోతున్నారు. దీనవల్ల రోడ్ల జీవితకాలం నిర్ణీత గడువుకు ముందే పాడైపోతున్నాయి. పైగా రోడ్డు వెడల్పు (మార్జిన్) ఏకరూపంలో కాకుండా వంకర టింకరగా, ఎత్తుపల్లాలుగా ఉంటోంది. కొత్తగా నిర్మించిన రోడ్లు అయినప్పటికీ చూడడానికి ఆకర్షణీయంగా లేవు. రోడ్డు నిర్మించిన తర్వాత సంబంధిత కాంట్రాక్టరే కొంతవ్యవధి వరకూ నిర్వహణ బాధ్యతలు చూడాల్సి ఉన్నప్పటికీ బిల్లు అందగానే గాలికి వదిలేస్తున్నారు. దీనిపై అధికారులు కూడా చర్యలు తీసుకోవడానికి వీలుండడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన

... మిగతా 6వ పేజీలో

చీటీల పేరుతో మోసం చేసిన వారిపై కేసు

తగరపువలస,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 2వ వార్డు వలందపేట గ్రామానికి చెందిన సరగడ పార్వతి, ఆమె భర్త లక్ష్మణ రావు చీటీల పేరుతో మోసం చేసినట్టు ఫిర్యాదు రావడంతో భీమిలి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వలందపేట, నమ్మివానిపేట, ఎడదాసరిపేట గ్రామాలకు చెందిన మహిళలు పార్వతి దంపతుల వద్ద చీటీలు వేసేవారు. ఈమేరకు వారు సుమారు రూ 47.40 లక్షల వేర చెల్లింపులు చేయలేదని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వలందపేట గ్రామానికి చెందిన కొసన అప్పలకొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ బి. సుధాకర్ తెలిపారు. పార్వతి దంపతులు దసరా చీటీలు, వరలక్ష్మి చీటీలు, పప్పుల చీటీ పేరుతో వందలాది మంది వద్ద 2020లో డబ్బులు కట్టించుకున్నారని, 2022 ఆగస్టు నాటికి చీటీల గడువు పూర్తయినా చెల్లింపులు చేయలేదని చెప్పారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్కటి చొప్పున పసిడి కుసుమాలతో పూజలు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

మాల మహానాడు రాస్తారోకో

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తాళ్లవలస కూడలిలో మాల మహానాడు కార్యకర్తలు ఆదివారం రాస్తారోకో చేశారు. వాహనాలను నిలుపుదల చేసి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాల మహానాడు వ్యవస్థాపకుడు బాగం గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బోని సన్నిబాబు, కుల వివక్ష పోరాట సమితి ఉపాధ్యక్షురాలు బి. లక్ష్మి, సియాద్రి రాంబాబు, బోని నరసింగరావు, రామారావు పాల్గొన్నారు.

ఆరో వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతుందని ఆరో వార్డు పార్టీ ఉపాధ్యక్షుడు నాగోతి వెంకట్రావు తెలిపారు. ఆదివారం వార్డులోని రేవళ్లపాలెంలో పార్టీ సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతిన శ్రీనివాసరావు, బంక సుబ్రహ్మణ్యం, ఇలిపిల్ల సూరిబాబు పాల్గొన్నారు. అలాగే పీఎంపాలెం కాలనీలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

దుప్పట్లు పంపిణీ

భీమునిపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి వివిధ ప్రాంతాల్లో ఉన్న సంచార జాతుల వారికి శనివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. భీమిలి, వేములవలస, వలందపేట, తగరపువలస, మోదవలస ప్రాంతాల్లో ఉంటున్న 60 కుటుంబాలకు వీటిని అందజేశారు. శ్రీరామచంద్రమూర్తి తండ్రి, భీమిలి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కలిగొట్ల భాస్కరరావు వర్ధంతి పురస్కరించుకుని దుప్పట్లు పంపిణీ చేసినట్టు దాత కుటుంబ సభ్యులు తెలిపారు.

నర్సీపట్నం అమ్మాయి... ఫ్రాన్స్ అబ్బాయి



సింహాచలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం అమ్మాయి, ఫ్రాన్స్ అబ్బాయి వివాహంతో ఒక్కటయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నానికి చెందిన సుశీల 2023లో ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ స్ట్రేస్‌బర్గ్‌లో కెమిస్ట్రీ పీహెచ్‌డీ చదివేందుకు వెళ్లారు. అదే వర్సిటీలో ఆచార్యుడుగా పనిచేస్తున్న విస్సెంట్‌తో పరిచయం ఏర్పడి, ప్రేమకు దారితీసింది. ఈమేరకు ఇరు కుటుంబీకుల అంగీకారం ప్రకారం ఈనెల 21న విశాఖలోని కల్యాణ మండపంలో వివాహం చేసుకున్నారు. ఆదివారం వారు అప్పన్న స్వామిని దర్శించుకున్నారు.



బింద్రానగర్ కాలనీలో బురదమయంగా ఉన్న రోడ్డు



పాఠశాల ముందు నిలిచిన వర్షం నీరు

భయపెడుతున్న బింద్రానగర్ రోడ్లు

- వర్షం పడితే చెరువులను తలపిస్తున్న గుంతలు
- గత ఐదేళ్లలో కనీస నిర్వహణ కరువు
- రాకపోకలకు స్థానికుల అవస్థలు

మధురవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని బింద్రానగర్, షిప్‌యార్డు కాలనీ ప్రాంతాల్లోని రోడ్లు వర్షం పడితే చెరువులను తలపిస్తున్నాయి. ఈ కాలనీలు ఏర్పడి సుమారు రెండున్నర దశాబ్దాలు కావస్తున్నా..ఇంతవరకు పూర్తిస్థాయిలో రోడ్లను అభివృద్ధి చేయలేదు. గత ఐదేళ్లలో కనీసం నిర్వహణ పనులు కూడా చేపట్టలేదు. ఈ కాలనీల్లో 40, 60 అడుగుల వెడల్పు రోడ్లు వర్షం పడితే చిత్తడిగా మారి, కనీసం నడవడానికి కూడా అనుకూలంగా లేవు. ఈకాలనీల్లో పదుల సంఖ్యలో అపార్టుమెంట్లు ఉన్నాయి. వీటిలో వందల మంది నివసిస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రైవేటు పాఠశాల ముందు కాలువలు లేకపోవడంతో వర్షం పడితే నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో పాఠశాలకు పిల్లలను బైక్‌లపై తీసుకువస్తున్న తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బింద్రానగర్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నాం



బింద్రానగర్‌లో రోడ్లు గుంతలు పడడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.కాలనీలో రహదారులను అభివృద్ధి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు గతంలో వినతులు ఇచ్చాం. ఇంతవరకు రోడ్లను అభివృద్ధి చేయలేదు.

కావూరి రమేశ్, స్థానికుడు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఒకరి అరెస్టు - రూ. 5 లక్షలు స్వాధీనం



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ వెంకట్రావు

ఎండాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ పనోరమ హిల్స్‌లో జరిగిన చోరీ కేసును పీఎంపాలెం క్రైం పోలీసులు ఛేదించారు. ఈమేరకు ఆదివారం పీఎంపాలెం స్టేషన్‌లో ఏడీసీపీ (క్రైమ్) ఎ. వెంకట్రావు కేసు వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8న పనోరమ హిల్స్‌లోని 43/ఎ నంబర్ గల విల్లాలో దొంగతనం జరిగింది. కేజీహెచ్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్న సీతామహాలక్ష్మి భీమవరంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీలో 1040 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 20 లక్షల నగదు అపహరణకు గురైంది.సంఘటన జరిగిన ప్రదేశంలో సేకరించిన చేతి వేళ్ల ముద్రల ఆధారంగా చోరీ చేసిన వ్యక్తి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కుందన్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. శనివారం ఎండాడ లా కళాశాల రోడ్డులో అతన్ని అరెస్టు చేసి, రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారు ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి రెక్కీ నిర్వహించి, దొంగతనాలకు పాల్పడతారని ఏడీసీపీ వివరించారు. మిగతా వారిని విచారణ చేయాల్సి ఉందని, వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు క్రైం సీఐ బీఎస్ఎస్ ప్రకాశ్, ఎస్ఐలు ఉన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం కార్యకర్తలు

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తగరపువలస, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఈనెల 28, 29వ తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు జరగనున్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం వారు చిట్టివలసలోని పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, ఆర్. నరసింగరావు, కె. నాగరాణి, వి. నాగరాజు, బాగం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వుడా రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు



రహదారి పక్కన ఉన్న వాహనాలు

మధురవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మిథిలాపురి వుడాకాలనీ ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంద అడుగుల రహదారిలో రోడ్లకి ఇరువైపులా అనధికార దుకాణాలు ఉండడంతో కొనుగోలుదారులు వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. వాహనాలు నిలిపివేయడా నికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఆదివారం ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. చేపలు, మాంసం, కూరగాయల వ్యాపారులతో పాటు తోపుడు బండ్ల వ్యాపారులు పక్కన అమ్మకాలు సాగిస్తున్నారు. ఈవిషయమై పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

శారదామణి దేవి జయంత్యుత్సవాలు ప్రారంభం



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

భీమునిపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీశారదా రామకృష్ణ మందిరంలో భగవతి శారదామణిదేవి జయంత్యుత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సహస్రనామ పూజలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయం నిర్వాహకురాలు ఆర్. కృష్ణవేణి ఈశ్వర్ ఆధ్వర్యంలో కూచిపూడి ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం అఖండ హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి సత్యానందరావు, పి. బాలా మాస్టారు, డాక్టర్ కె. రామారావు, సుబ్రహ్మణ్యం, ఆదిత్య, రామకృష్ణ, పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్



కమిషనర్ విశ్వనాథన్‌కు ప్రసాదం అందిస్తున్న పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు

సింహాచలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్తి ఆలయ లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

సంప్రదాయబద్ధంగా ధనుర్మాసోత్సవాలు



సింహాచలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై, కొండదిగువ పద్మావతి, అలిమేల్ మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తిని గోదాదేవిగా స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానం గా అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఉంచారు. పండితుల వేద మంత్రోచ్ఛారణలు, ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ బేడా మండ పం తిరువీధి జరిపారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో ఆండాళ్ రచించిన తిరుప్పావైలోని ఏడవ పాశురాన్ని పండితులు అనుసంధానం చేశారు.

ఇస్కాన్‌లో వారాంతపు పూజలు

సాగర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇస్కాన్‌లో వారాంతపు పూజలను భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవని కృష్ణతత్వంపై ప్రవచనాలు చేశారు.ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని సూచించారు.

భీమిలి, సాగర్‌నగర్ బీచ్‌లకు సందర్శకుల తాకిడి



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

భీమునిపట్నం/సాగర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, రుషికొండ తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. వర్షాలు తగ్గి, వాతావరణం చల్లబడడంతో నగరవాసులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. దీంతో అన్ని సందర్శనీయ స్థలాలు జనంతో కళకళలాడాయి. చాలామంది ముందుగా కైలాసగిరికి వెళ్లి అక్కడ నుంచి బీచ్‌లకు వచ్చారు. తెన్నేటి పార్కు వద్ద ఉన్న బీచ్, సీతకొండ వ్యూపాయింట్, సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి తీర ప్రాంతాలు సందర్శకులతో సందడిగా మారాయి. రుషికొండ బీచ్‌లో కొందరు సముద్ర స్నానాలు చేయగా, మరికొందరు ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడారు.

నగరంలో వైట్‌టాప్ రోడ్లు!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం సమస్య పరిష్కారానికి శాశ్వతచర్యలు తీసుకోవాలని భావించింది.

రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఇకపై ఒక్కో స్ట్రెచ్‌కు కాకుండా 30 అడుగులు అంతకంటే ఎక్కువ వెడల్పుకలిగిన రోడ్లకు మరమ్మతులు, అవసరమైతే కొత్తలేయర్లు నిర్మాణం కోసం రెండేళ్ల కాలవ్యవధితో గ్లోబల్‌టెండర్ విధానం అమలుచేయాలని నిర్ణయించింది. జీవీఎంసీ పరిధిలో రోడ్ల నిర్మాణం కోసం ఏటా సుమారు రూ.వంద కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐదేళ్లకు రూ.500 కోట్లు వరకూ ఖర్చవుతోంది. అదే మొత్తానికి ఐదేళ్ల నిర్వహణ చూసేలా ఎల్‌అండ్‌టీ, షాపూర్‌పల్లొంజి, ఎన్‌సీసీ, నవయుగ వంటి పెద్దసంస్థల నుంచి గ్లోబల్ టెండర్ పిలవాలని రాష్ట్రంలోని అన్ని పట్టణస్థానికల సంస్థలకు మౌఖికంగా ఆదేశించింది. జీవీఎంసీ పరిధిలో 30 అడుగులు అంతకంటే వెడల్పు కలిగిన రోడ్లు, వాటి ప్రస్తుత పరిస్థితి తదితర వివరాలతో నివేదిక తయారుచేసి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. వర్షాకాలంలో నీరునిలిచిపోవడం, భారీవాహనాల వాహనాల రాపిడికి నీరుచేరిన చోట తారు పైకి లేచిపోవడం వల్ల వారం, పదిరోజులకే గుంతలు పడుతున్నాయని అధికారులు గుర్తించారు. దీనివల్ల రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించినప్పటికీ ప్రయోజనం లేదని అధికారులు చెబుతున్నారు. సిమ్మెంట్ కాంక్రీట్ మిక్సింగ్ (వైట్‌టాప్)తో రోడ్లను నిర్మిస్తే ఎంతవర్షం నీరు నిలిచినా ఇబ్బంది ఉండదని, పైగా వాహనాల తాకిడిని తట్టుకునే సామర్థ్యం ఎక్కువని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు నగరంలో తొలివిడతగా 25 కిలోమీటర్లు వైట్‌టాప్ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతి లభిస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి పురస్కారం అందుకుంటున్న అధికారులు

తూర్పుకోస్తా రైల్వేకు పురస్కారం

విశాఖపట్నం,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వేకు 2024 వార్షిక సంవత్సరానికి ఉత్తమ అతి విద్యుత్ ఇంజనీరింగ్ ప్రతిభా పురస్కారం లభించింది. వివిధ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రోటోకాల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్ ఝా, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. హరిప్రియ, టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగి సుప్రభాత్ మిత్రలకు సంయుక్తంగా ఉత్తమ అతి విశిష్ట రైలు సేవా పురస్కారం పొందారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి ఈ అవార్డులు అందుకున్నారు.



స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న దృశ్యం

అనంతుని ఆలయంలో ఘనంగా బేడా సేవ

పద్మనాభం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుడి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం బేడా సేవ చేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారికి విశేష అర్చనలు జరిపారు. అనంతరం గోదాదేవి సమేత వేణుగోపాలస్వామిని పల్లకీపై నిలిపి ఆలయం బేడా చుట్టూ ఊరేగిస్తూ బేడాసేవ చేశారు. ఈ సందర్భంగా భక్తులు నగర సంకీర్తన చేశారు.

మధురవాడ రైతుబజార్ ఈఓగా హరిత

కొమ్మాది, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ రైతుబజార్ ఈఓగా హరిత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పని చేసిన జగదీశ్‌ను కంచరపాలెం రైతు బజార్‌కు బదిలీ చేశారు. గాజువాక రైతుబజార్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న హరితను మధురవాడకు నియమించారు.

ఉత్సాహంగా విశాఖ సింగర్స్ వన భోజనాలు

భీమునిపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ మనో మెలోడిస్ ఆధ్వర్యంలో భీమిలిలోని బీచ్ బ్లాక్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విశాఖ జిల్లా సింగర్స్ పిక్నిక్ ఉత్సాహంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 350 మంది గాయనీ, గాయకులు పిక్నిక్‌కు హాజరై, ఉత్సాహవంతమైన పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్ శ్రీ హర్షిణి, సీనియరు గాయకులు ఫణి భూషణ్‌రావు, గణేశ్, యాద్‌కుమార్, ధనుంజయ్, కీబోర్డు ప్లేయర్స్ సోమేశ్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ జిల్లా గాయనీ, గాయకులు

అడవి...అంతరిస్తోంది

... 5వ పేజీ తరువాయి

భూభాగంలో అటవీ విస్తీర్ణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రాష్ట్రంలో 55.58 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. తరువాత నగరం ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లా 28.61 శాతంతో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. అటవీశాఖ నమోదు చేసిన ప్రాంతాల్లో చెట్ల సాంద్రత తగ్గడం అంటే (దట్టమైన చెట్లు కొట్టి వ్యవసాయానికి మళ్లించడం) ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు పోడు వ్యవసాయం కోసం అడవులు నరికివేస్తున్నారు. మైదాన ప్రాంతంలోని పొలాల్లో సరుగుడు, మామిడి, టేకు, ఆయిల్‌పాం తోటలు పెంచుతారు. కోతకు వచ్చినవి నరికివేస్తుంటారు. పంట సరిగ్గా రానిమామిడి, జీడి తోటలు తొలగిస్తారు. ఈ సమయంలో అటవీశాఖ సర్వే చేసినప్పుడు శాటిలైట్ ఇమేజ్‌లో అక్కడ ఖాళీ భూమి ఉన్నట్టుగా నమోదవుతుంది. దీంతో అటవీ విస్తీర్ణం తగ్గుదల నమోదవుతుంది. ఏటా కోట్ల మొక్కలు నాటినా అటవీ విస్తీర్ణం పెరగకపోవడం ఇప్పటికీ శేషప్రశ్నగా ఓ అధికారి వ్యాఖ్యానించారు.

అగ్నిప్రమాదాల్లో అల్లూరి రెండోస్థానం..

దేశంలోని అడవుల్లో పలుచోట్ల తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇందులో అల్లూరి సీతారామరాజు జిల్లా రెండోస్థానంలో ఉంది. తాజా నివేదిక మేరకు 2022 నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు 6,399 అగ్నిప్రమాదాలు సంభవించాయి. 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 3,639 ప్రమాదాలు సంభవించాయి. అల్లూరి జిల్లాలో శీతాకాలం ముగిసిన తరువాత వాతావరణంలో మార్పుల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 194 అగ్నిప్రమాదాలు సంభవించగా, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు 126కు తగ్గాయి. విశాఖ జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు మూడు, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు నాలుగు ప్రమాదాలు సంభవించాయి.

అర్బన్‌లో విశాఖ ప్రథమ స్థానం

జిల్లాలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు 615.53 చ.కి.మీ. విస్తీర్ణంతో విస్తరించిన విశాఖ నగరం జనసమ్మర్ధంగా ఉంటుంది. అటువంటి మహానగరంలో అడవుల విస్తీర్ణం ఎక్కువ. రాష్ట్రంలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉన్న పట్టణాలు/నగరాల్లో విశాఖపట్నం ప్రథమస్థానంలో ఉంది. నగరంలో 68.59 చ.కి.మీ. విస్తీర్ణంలో మధ్యస్థాయి అడవి ఉండగా ఓపెన్ ఫారెస్టు 114.10 చ.కి.మీ. మేర విస్తరించాయి. మొత్తం 182.69 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉంది. మొత్తంలో అటవీ విస్తీర్ణం 29.68 శాతంగా ఉంది. నగరంలో కంబాలకొండ ఒక్కటే 1400 హెక్టార్లలో విస్తరించింది. జూ, సింహాచలం కొండ, విశాఖ ఉక్కు టౌన్‌షిప్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, పార్కుల్లో లక్షల చెట్లతో పచ్చదనం నిండి ఉంది. హుద్‌హుద్ తరువాత నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడంతో పచ్చదనం పరచుకుంది. వీటన్నింటిని కలిపి ఓపెన్ ఫారెస్టుగా గుర్తిస్తారు. అయినా నగరంలో కాలుష్యం, వేసవిలో వేడి తగ్గాలన్నా మరిన్ని మొక్కలు పెంచాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

ఏయూపై ఫోకస్

... 5వ పేజీ తరువాయి

వ్యవహారాలపై ఇప్పటివరకు ప్రభుత్వానికి సుమారు 20 ఫిర్యాదులు అందినట్టు చెబుతున్నారు.

సంజయ్‌పై ఆరా..

మాజీ సీఐడీ చీఫ్ సంజయ్ వర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశారు. ఈ కోర్సు పూర్తి చేసే క్రమంలో పరీక్షలను ఎవరితోనో రాయించారని, ఇందుకు వర్సిటీ ఉన్నతాధికారులు సహకరించారని ఉన్నత విద్యాశాఖ మంత్రికి కొంతమంది ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు. దీనిపై మంత్రి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారంటున్నారు. దీనిపై అంతర్గతంగా విచారణ చేపడుతున్నప్పటికీ, వర్సిటీ ఉన్నతాధికారులు పెదవి విప్పడం లేదు.

ఉక్కు నిర్వీర్యానికి కుట్ర!

... 5వ పేజీ తరువాయి

లేవని చెప్పడం ఇదే తొలిసారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పోటీలకు హాజరైతే తప్పనిసరిగా విశాఖ ఉక్కుకు మెడల్స్ వస్తాయని, దాంతో పాటే పేరు కూడా వస్తుందని, అది ప్రస్తుత యాజమాన్యానికి ఇష్టం లేదని, అందుకే ఇలా చేశారని చెబుతున్నారు.

సీఎండీ విమాన ఖర్చుల సంగతి ఏమిటో...?

ప్రస్తుతం సీఎండీ సక్సేనా ఎంఓఐఎల్ (నాగపూర్)కు చెందిన ఉద్యోగి. డిప్యుటేషన్‌పై విశాఖ ఉక్కులో పనిచేస్తున్నారు. ఆయన వారానికి మూడు, నాలుగు రోజులు ఇక్కడ ఉంటున్నారు. నాగపూర్-ఢిల్లీ-విశాఖపట్నం మధ్య ఎక్కువగా విమాన ప్రయాణాలు చేస్తున్నారు. ముందుగా విమాన టికెట్లు తీసుకుంటే సాధారణ రేటుకు వస్తాయి. ఆకస్మికంగా ప్రయాణం పెట్టుకుంటే రేట్లు అధికంగా ఉంటాయి. అయితే సీఎండీ ఏ ప్రయాణమూ షెడ్యూల్ ప్రకారం కాకుండా, ముందు తీసిన టికెట్లు రద్దుచేయించి అప్పటికప్పుడు వేరే టికెట్లు తీయిస్తున్నారు. దానివల్ల నష్టంతో పాటు, అప్పటికప్పుడు ఎక్కువ రేటు పెట్టి కొనాల్సి వస్తోంది. ఆయన ప్రయాణాలన్నీ అలాగే జరుగుతున్నాయని, మరి వాటి నష్టం ఎవరు భరిస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సొంత ప్రయాణాలకు నచ్చినట్టు ఖర్చులు చేస్తున్న వ్యక్తి, ప్లాంటుకు పేరు తెచ్చే పోటీలకు వెళతామంటే వద్దని ఎందుకు చెబుతున్నారో వెల్లడించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. విశాఖ ఉక్కులో జరుగుతున్న వ్యవహారాలపై తక్షణమే ఉత్తరాంధ్ర ఎంపీలు సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.

☛ సంక్షిప్తంగా..

9న స్టీల్ క్లబ్ ఎన్నికలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్ పాలక వర్గ ఎన్నికలు జనవరి తొమ్మిదిన నిర్వహించేందుకు ఎన్నికల అధికారి బాబూ నాయక్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుత పాలక వర్గం పదవీ కాలం ముగియనుండడంతో నూతన పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జనవరి రెండు వరకు నామినేషన్ల స్వీకరణ, మూడో తేదీ రాత్రి ఎనిమిది గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, తొమ్మిదో తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడున్నర వరకు, మళ్లీ సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ జరగనున్నది. అనంతరం ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

హెల్త్ సిటీలో క్రిస్మస్ సందడి


ఓ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

ఆరిలోవ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ హెల్త్ సిటీలో పలు వైద్యశాలలు క్రిస్మస్ వేడుకల నిర్వహణకు సిద్ధమవుతున్నాయి. తమ ఆస్పత్రుల్లో పని చేసే సిబ్బంది కానుకలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశాయి. ఇప్పటికే క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసి వాటికి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో ఆయా ఆస్పత్రుల వద్ద సందడి నెలకొంది.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్‌లో గోపీచంద్ ప్రతిభ



రామ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో నగరానికి చెందిన దమ్ము గోపీచంద్ తన ప్రతిభ చాటి నాలుగో స్థానంలో నిలిచారు. పశ్చిమ బెంగాల్‌లోని ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో పాల్గొన్న గోపీచంద్ తన ప్రతిభ చాటాడు. గోపీచంద్ ప్రస్తుతం బుల్లయ్య కాలేజీలో ఎంపీఏ చదువుతున్నాడు. గత నాలుగేళ్ల తన తండ్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.. ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన బాడీబిల్డింగ్‌లో స్వర్ణపతకం సాధించారు. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించటమే తన లక్ష్యమని గోపీచంద్ అంటున్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 36 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 38, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

అబ్బురపరుస్తున్న చిత్రకళా నైపుణ్యం

ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రదర్శనకు ఆదరణ





- కళాఖండాలు, వర్ణ చిత్రాల కొనుగోలుకు సందర్శకుల ఆసక్తి
- 29 వరకు ఎగ్జిబిషన్

వెంకోజీపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థుల సృజనాత్మకత నగర వాసుల మనసు దోచుకొంది. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానులు, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శనలో అద్భుత చిత్రాలు అందుబాటులో ఉంచడంతో పాటు అమ్మకాలు చేశారు. దీంతో కళాభిమానులు ప్రదర్శనను తిలకించి తమకు నచ్చిన కళా చిత్రాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తుండడంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలు, శిల్పాలను రూపొందించే పనిలో నిమగ్నం అవుతున్నారు. విద్యార్థులు ఊహించిన దాని కంటే ఎక్కువ ఆదరణ దీనికి లభిస్తోంది, ఇంటిలో అలంకరణ, బహుమతులుగా ఇవ్వడానికి ఇక్కడ విద్యార్థులు చేసిన కళాఖండాలు, వర్ణ చిత్రాలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు వచ్చి వీటిని తిలకించి తమ మనసుకు నచ్చిన వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. ఈ నెల 29 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఈ ప్రదర్శన ఉంటుంది. విద్యార్థుల ప్రతిభకు నగరవాసుల నుంచి వస్తున్న ఆదరణ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని విభాగాధిపతి డి.సింహాచలం అన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న నగర వాసులు

భళారే.. భస్మాసుర హస్తం

మద్దిలపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ప్రదర్శించిన మోహిని భస్మాసుర నృత్య రూపకం అలరించింది. ప్రముఖ నాట్యాచారులు హరిరామమూర్తి శిష్యులు భస్మాసుర హస్తం కథను కూచిపూడి నృత్యం ద్వారా వివరించి 'భళా..' అనిపించారు. భస్మాసురుడుగా హరిరామమూర్తి, మోహినిగా సన్నిధ, సుబ్బరాజు శివుడుగా అద్భుతం నృత్యాలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. ఎవరి తలపై చేయిపెడితే వారు భస్మం అయిపోవాలని శివుడు వద్ద వరం పొందిన భస్మాసురుడు, వరాన్ని పరీక్షించడానికి పరమశివుడు తలపైనే చేయి పెట్టాలని ప్రయత్నిస్తాడు. అప్పుడు శివుడు భయంతో పరుగుపెడుతూ విష్ణుమూర్తి శరణు కోరుతాడు. విష్ణుమూర్తి మోహిని రూపంలో భస్మాసురుడిని ఆకట్టుకుని నాట్యం చేసి భస్మాసురుడు తనచేయి తన తలపైనే పెట్టుకునేలా చేసిన అంశాలు నృత్య రూపకంలో ప్రదర్శించి అందరి హర్షధ్వానాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాభారతి నిర్వహకులు జి.రాంబాబు, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కళాకారుల అభినయం

అపర్ణకు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు



సౌత్‌ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు అందుకుంటున్న అపర్ణ

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య కళాకారిణి అపర్ణ బెంగళూరు కూచిపూడి మరకతమణి సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు 2024 అందుకున్నారు. మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన ఎస్ఎస్‌బీ అపర్ణ తన నృత్యకౌశల్యాన్ని ప్రదర్శించి ఇటీవల ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పలు అవార్డులు అందుకున్నారు. సుమారు 500 వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. 2008లో జనార్దనరావు, శ్రీదేవి దంపతులకు జన్మించిన ఆమె తొమ్మిదేళ్ల వయస్సులోనే కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభించారు.

గత ఏడేళ్లుగా నృత్య ప్రదర్శనలిస్తూ కూచిపూడి నృత్య ప్రాశస్త్యాన్ని చాటారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, మ్యూజిక్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, ఎక్సలెన్సీ బుక్ ఆఫ్ రికార్డుల్లో తన పేరు నమోదు చేసుకున్నారు. నాట్యబాల పురస్కారం, నాట్య కుసుమల ప్రతిభా పురస్కారం, గరుడ కీర్తి పురస్కారం, నృత్య ప్రతిభా పురస్కారం ఇలా ఎన్నో అవార్డులు అందుకున్నారు. రామ్‌చరణ్ ట్రోఫీలో ప్రత్యేక జ్యూరీ అవార్డు, మిలన్ 2023, 2024లను కూడా తన సొంతం చేసుకుంది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంత్యుత్సవాల్లో పద్మశ్రీ చిరంజీవి చేతుల మీదుగా ప్రత్యేక సన్మానం పొందారు.

ఏడు కేసుల్లో ఆరుగురు చోరుల అరెస్టు

- రూ.5 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు చోరీ కేసులకు సంబంధించి ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.ఐదు లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు ఆదివారం క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి, నరవ, విమాన్‌నగర్ ప్రాంతాల్లో రెండిళ్లల్లో వెండి ఆభరణాలు, కోడిపుంజులు, నాలుగు గ్యాస్ సిలిండెర్లు, వెల్డింగ్ మిషన్, ఎలక్ట్రిక్ మిషన్లు, వైర్ల చోరీకి పాల్పడిన గోపాలపట్నంలోని కొత్తపాలేనికి చెందిన సుశాంత్ సాహూ (39), నగరంలోని కొబ్బరితోటకు చెందిన జగన్నాథ్ సాహూ(26) లను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

అలాగే పెందుర్తి, అక్కిరెడ్డిపాలెంలలో పది కోళ్లను దొంగిలించిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల రమణ, నాగలూరి నాగరాజు, దొడ్ల ఈశ్వరరావులను అరెస్టు చేసినట్టు వారు తెలిపారు. సుజాతనగర్‌లో గల ఓ జ్యూస్ సెంటర్‌కు చెందిన స్టీల్ కౌంటర్‌ను చోరీ చేసిన చినముషిడివాడకు చెందిన కోనూరు రవిశంకర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఆయా కేసులను పెందుర్తి క్రైమ్ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేసి తక్కువ వ్యవధిలోనే నిందితులను పట్టుకుని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది నాగరాజు, ఎంఎస్ నాయుడు, శ్రీరామ్, భవానీ, శివప్రసాద్, దేవుడు, ఎల్ఎస్ నాయుడు, పైడిరాజులను ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు.


రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్న 14 మంది ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు. చిత్రంలో విజయనగరం జోనల్ చైర్మన్ దొన్ను దొర, విశాఖ జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, డీటీసీ ఆదినారాయణ, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

'చెత్త' కష్టాలు!

- చెత్త వేయవద్దంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన జీవీఎంసీ అధికారులు



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫెక్సీలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'చెత్త వేయకండి' అని చెబితే అక్కడి జనం ఆగడం లేదు. 'సూచన బోర్డులు మమ్మల్నేమీ ఆపలేవు' అన్నట్లు అక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తూనే ఉంటుంది. దీనికి చెక్ పెట్టడానికి జీవీఎంసీ కూడా కాస్తా కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జీవీఎంసీ 18వ వార్డులోని డీఆర్‌డీఏకార్యాలయం ఎదురుగా చెత్తాచెదారంతో ఆ ప్రదేశం అధ్వానంగా ఉండేది. ఎప్పటికప్పుడు శుభ్రం చేసినా, పరిస్థితిలో మార్పు ఉండడం లేదు. అందుకని చెత్త వేయరాదు, జరిమానా రూ.1000 అని పెట్టి, ఆ బోర్డులో ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటరు గొలగాని దంపతుల ఫొటోలతో పాటు దేముడి బొమ్మ కూడా పెట్టారు. కనీసం సెంటిమెంట్‌తో అయినా ఇక్కడ చెత్త వేయడం మానేస్తారని అధికారుల భావన కావచ్చు. ఈ ఏర్పాట్లు కొంతవరకూ సఫలం అయినా, బోర్డు పాడైపోతే తర్వాత పరిస్థితి ఏమిటో చూడాల్సిందే!

స్పా సెంటర్‌లో వ్యభిచారం

- పోలీసుల తనిఖీలో గుట్టురట్టు
- అయిదుగురి అరెస్టు
- యువతులు శక్తిసదన్‌కు తరలింపు

మద్దిలపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయింది. వీఐపీ రోడ్డు సీబీఎం కాంపౌండ్‌లోని ఒక భవనం అయిదో ఫ్లోర్‌లో డెవిన్సి థాయ్ స్పా నిర్వహిస్తున్నారు. ఇందులో యువతులకు నగదు ఆశ చూపి వ్యభిచారం చేయిస్తున్నారనే సమాచారంతో త్రీటౌన్ పోలీసులు రైడ్ చేశారు. స్పా సెంటర్‌లో నాలుగు గదుల్లో నలుగురు యువతులతో నలుగురు విటులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. స్పా యజయాని, విటులను ఆదివారం అరెస్టు చేసి యువతులను శక్తిసదన్ హోమ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి.

పిఠాపురంకాలనీ కళాభారతి సమీపంలో నివాసముంటున్న సుతారి వంశీధర్ వీఐపీ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ అయిదో ఫ్లోర్‌లో డెవిన్సి థాయ్ స్పా నిర్వహిస్తున్నాడు. స్పా సెంటర్‌కు వచ్చే పురుషులను కోరుకున్న విధంగా మసాజ్ చేయిస్తుంటారు. అయితే అతడు అందమైన యువతులకు నగదు ఆశ చూపి వ్యభిచారంలోకి దింపుతున్నాడు. పురుషులకు మసాజ్‌తో పాటు అదనంగా డబ్బులిస్తే యువతులతో శారీరకంగా కలవొచ్చని చెప్పి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా స్పా సెంటర్‌లో నాలుగు గదుల్లో బెడ్‌లు వేసి నలుగురు యువతులను పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు శనివారం రాత్రి స్పా సెంటర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో నాలుగు గదుల్లో నలుగురు విటులు యువతులతో వ్యభిచారం నిర్వహిస్తుండగా పట్టుకున్నారు.వ్యభిచారానికి పాల్పడుతున్న నలుగురు యువతులను శక్తిసదన్ హోంకు తరలించారు. స్పా యజమాని సుతారి వంశీధర్, విటులు గునబత్తుల కృష్ణమోహన్, కొల్లిమల్ల దివాకర్, మల్లా కల్యాణ్, హరిదాసు శ్రీహర్షలను ఆదివారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి రిమాండ్ విధించారు.


మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

రవాణా శాఖ మంత్రికి ఎన్ఎంయూఏ సత్కారం

ద్వారకా బస్‌స్టేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖా మంత్రి ఎం. రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఎన్ఎంయూఏ రాష్ట్ర, రీజనల్ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ విశాఖపట్నం డిపోలో నూతన బస్సుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొరను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం. సురేశ్‌నాయుడు, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు బి. నీలకంఠం, గండి రామకృష్ణ, జిల్లా కమిటీ చైర్మన్ ప్రాన్, డివిజన్ కార్యదర్శి ఏకే శివాజీ పాల్గొన్నారు.

26 నుంచి వేంకటేశ్వర ఉదయాస్తమాన సేవలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు డీఆర్‌డీఏ సమీపంలోని ఎంవీ భద్రం కమ్యూనిటీ హాలులో ఈ నెల 26 నుంచి 29 వరకూ శ్రీవేంకటేశ్వర ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు రుషిపీఠం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటలకు సుప్రభాతంతో ప్రారంభమై అర్చన, తోమాల సేవ, కల్యాణం, తిరువీధోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు పవళింపు సేవలను భక్తులు ప్రత్యక్షంగా ఇక్కడ వీక్షించవచ్చని సంస్థ తెలిపింది. అందరూ ఆహ్వానితులేనని, ప్రసాదం ఉచితంగా అందజేస్తారని పేర్కొంది. 26న సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఊరేగింపుతో ప్రారంభమయ్యే శ్రీవేంకటేశ్వర స్వామివారి ఉదయాస్తమాన సేవ 29న రాత్రి 8.30 గంటలకు పూర్తవుతుందని, తిరుమల నియమాల మాదిరిగానే సంప్రదాయ వస్త్రధారణతో భక్తులు రావాలని తెలిపింది. ప్రతి రోజూ ఆకెళ్ల విభీషణ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు, అన్నమయ్య సంకీర్తనలు, నాదనీరాజనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. ఇతర వివరాలకు అరుణ గాయత్రి ఫోన్: 91608 85953లో సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది.

జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షుడిగా రామకృష్ణ


జేసీఐ విశాఖవ్యాలీ అధ్యక్షుడు కొంకిపూడి రామకృష్ణ, సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ వ్యాలీ నూతన అధ్యక్షుడిగా కొంకిపూడి రామకృష్ణ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆయన నగరంలోని లయన్స్ క్లబ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ అధ్యక్షుడు ఎ. సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కీ నోట్ స్పీకరుగా కేవీరావు, గౌరవ అతిథిగా జోనల్ ఉపాధ్యక్షుడు కేపీ కల్యాణ్, ప్రత్యేక అతిథులుగా రాంసూర్య కొల్లూరు, సింధూర తాడి హాజరయ్యారు. పదవీ స్వీకరణ అనంతరం ఈఏడాది జేసీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు అంశాలపై రామకృష్ణ మీడియాకు వివరించారు. అన్ని రంగాల వారికి సేవలందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం చిత్తు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ప్రొఫెసర్ హరినాథ్


వెంకోజీపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనం అవుతుందని ఏయూ ఆర్ట్స్ కళాశాల చీఫ్ వార్డెన్ ఎస్.హరినాథ్ అన్నారు. మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకంలో ఏయూను డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకర అలవాట్లు కలిగి ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్‌లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని విద్యార్థులకు వివరించారు.

ఏయూ ఇంటర్ యూనివర్సిటీ యోగా జట్టు ఎంపిక


అంతర్ వర్సిటీ యోగా పోటీలకు ఎంపికైన ఏయూ యోగా జట్టు

వెంకోజీపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంటర్ యూనివర్సిటీ యోగా ఏయూ పురుషులు, మహిళలు జట్ల ఎంపికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ దూర విద్యాకేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనివర్సిటీ యోగా పోటీలు భువనేశ్వర్‌లో కిట్స్ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28 వరకు యోగాలోని వివిధ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. యోగాలో ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. యోగా కోచ్ వర్మ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో ప్యానెల్-2 విజయం


గెలిచిన ప్యానల్-2 ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లాకు ఎంవీపీ కాలనీ గిరిజన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్యానెల్ 2 విజయం సాధించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న గిరిజన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసు, జీసీసీ, రైల్వే సచివాలయం, పోర్టు ట్రస్టు, డాక్‌యార్డు, ఆర్ఐఎన్ఎల్, జీవీఎంసీ తదితర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు ఉదయం నుంచి గిరిజన్ భవన్ ముందు సందడి చేశారు. సంఘంలో మొత్తం 2234 మంది సభ్యులు కాగా, 1469 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యానెల్ 1 అరటి పండు గుర్తుతో డిప్పల సాంబమూర్తి అధ్యక్షుడిగా పోటీ చేయగా, ప్యానెల్ 2 గాలిపటం గుర్తుతో ఎస్.అప్పలరాజు పోటీలో పోటీ పడ్డారు. ఈ ఎన్నికలో 81 ఓట్ల తేడాతో ప్యానెల్ 2 విజయం సాధించింది.

వేదసారంపై పండిత గోష్ఠి



గోష్ఠిలో పాల్గొన్న వేదపండితులు

జగదాంబ కూడలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం వేదసభ, అర్చక సదస్సులో పండితులు వేద సారాంశాన్ని, విలువల గొప్పతనాన్ని వివరించారు. చతుర్వేదాలు, వైఖానస, స్మార్తం, శైవాగం, పాంచరాత్రం ఆగమనాలపై వేదపండితులు ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 21 మంది వేదపండితులు, 21 మంది అర్చకులు పాల్గొన్నారు. దేవస్థానం వేదపండితులు ముష్టి భీమశంకర శాస్త్రి, వేంకటేశ్వర ఘనాపాఠి, చావలి లక్ష్మీనారాయణ అవధాని, కోట పంచముఖి శర్మలు పలు అంశాలపై మాట్లాడారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండమంచిలి శ్రీనివాస శర్మ, బీఎస్ఎస్ భట్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవో కె.శోభారాణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న సినీ గీతాల పోటీ

డాబాగార్డెన్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సినీ సంగీత సేవా సంస్థ మెలోడి క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25న 15 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు యువతీ యువకులకు సెమి క్లాసికల్ సినీ గీతాల పోటీ నిర్వహిస్తున్నట్టు సంస్థ కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో విజేతలతో భవిష్యత్తులో ఆర్కెస్ట్రాలో పాటలు పాడిస్తామన్నారు. ఔత్సాహికులు ఈ నెల 24లోగా సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణను ఫోన్ (92466 22563)లో సంప్రదించాలని సూచించారు.

నగరంలో క్రిస్మస్ అలంకరణల సందడి



మహారాణిపేటలో అలంకరణ వస్తువులతో దుకాణం

మహారాణిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అన్ని ప్రధాన చర్చిలలో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు తమ ఇళ్లను అలంకరిస్తున్నారు. దీంతో అలంకరణ వస్తు సామగ్రి అమ్మకాలు ఊపందుకున్నాయి. క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్‌కు సుమారు పది రోజులు ముందుగానే వేడుకలు ప్రారంభిస్తారు. ఇంటిలో పశువుల పాక, క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేసుకొని విద్యుత్ దీపాలంకరణతో స్టార్‌ను ఆవరణలో వేలాడదీశారు. నగరంలోని మహారాణిపేటలో వందేళ్ల చరిత్ర కలిగిన సెయింట్ ఆంథోనీ చర్చి సమీపంలో క్రిస్మస్ అలంకరణ సామగ్రిని ఏటా విక్రయిస్తారు. పెద్దసంఖ్యలో క్రిస్టియన్లు ఇక్కడకే వచ్చి కొనుగోలు చేస్తారు. ఇక్కడ వినూత్న వస్తువులు, విద్యుత్ వెలుగులతో కూడిన క్రిస్మస్ చెట్టు, స్టార్స్, లైటింగ్ స్టార్స్, శాంతక్లాజ్ డ్రెస్‌లు, బెల్స్, రీట్స్ చమ్కీలు, పశువుల పాకల సెట్‌లు, ప్లాస్టిక్ బొమ్మలు తదితర వస్తువులు ఒకేచోట లభ్యమవుతాయి. ఇంకా పండుగకు రెండు రోజులే గడువు ఉండడంతో అలంకరణ వస్తువుల అమ్మకాలు శనివారం నుంచి ఊపందుకుంటాయి.

తూర్పుకోస్తా రైల్వేకు పురస్కారం



ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి పురస్కారం అందుకుంటున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వేకు 2024 వార్షిక సంవత్సరానికి ఉత్తమ అతి విద్యుత్ ఇంజనీరింగ్ ప్రతిభా పురస్కారం లభించింది. వివిధ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రోటోకాల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్ ఝా, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.హరిప్రియ, టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగి సుప్రభాత్ మిత్రలకు సంయుక్తంగా ఉత్తమ అతి విశిష్ట రైలు సేవా పురస్కారం పొందారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి ఈ అవార్డులు అందుకున్నారు. పురస్కార గ్రహీతలను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహు అభినందించారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

కంచరపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఆదివారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల, పలు ప్రైవేటు పాఠశాలల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌కు ఘనంగా నివాళులర్పించారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని గణిత దినోత్సవంగా పాటిస్తారు. అతి చిన్న వయసులో ఎన్నో గణిత ఆవిష్కరణలు చేసిన మహనీయుడు రామానుజన్ అని కొనియాడారు. రామానుజన్ చిత్రపటానికి కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పూలమాల వేసి నివాళులర్పించారు.

మందుబాబుల హల్‌చల్

మహారాణిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. కేజీహెచ్‌లో ప్రైవేట్‌గా పనిచేస్తున్న కొందరు రాత్రి సమయంలో జల్సా చేస్తున్నారు. ఆసుపత్రిలోనే తాగి అల్లరి చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆదివారం సాయంత్రం కూడా అల్లరి చేయడంతో పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

'పర్యావరణ హిత భోగీ మంట వేద్దాం'

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో భోగీ మంటను పర్యావరణ హితంగా లక్షా ఒక్క పిడకలతో వేద్దామని శాసనమండలి మాజీ సభ్యుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గురుద్వార సమీపంలోని కేశవ సేవా సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భోగీ పండుగ పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు కాల్చి అనారోగ్యం తీసుకురావద్దన్నారు. బియ్యం పిండి, పసుపు, కంకుమలతో ముగ్గులు వెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి అశోక్ సత్యా, మధుసూదనరెడ్డి, జేవీ రత్నం పాల్గొన్నారు.

పనోరమ హిల్స్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

» ఒకరి అరెస్టు - రూ. 5 లక్షలు స్వాధీనం » క్రైం ఏడీసీపీ వెంకట్రావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ ఎ.వెంకట్రావు, చిత్రంలో సీఐ ప్రకాశ్, ఎస్ఐలు

ఎండాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎండాడ పనోరమ హిల్స్‌లో జరిగిన చోరీ కేసును పీఎంపాలెం క్రైం పోలీసులు ఛేదించారు. ఈమేరకు ఆదివారం పీఎంపాలెం స్టేషన్‌లో ఏడీసీపీ (క్రైమ్) ఎ. వెంకట్రావు కేసు వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8న పనోరమ హిల్స్‌లోని 43/ఎ నంబర్ గల విల్లాలో దొంగతనం జరిగింది. కేజీహెచ్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్న సీతామహాలక్ష్మీ భీమవరంలోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1,040 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 లక్షల నగదు అపహరణకు గురైంది. సంఘటన జరిగిన ప్రదేశంలో సేకరించిన చేతి వేలిముద్రల ఆధారంగా చోరీ చేసిన వ్యక్తి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కుందన్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. శనివారం ఎండాడ న్యాయ కళాశాల రోడ్డులో అతడ్ని అరెస్టు చేసి రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారు ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి రెక్కీ నిర్వహించి, దొంగతనాలకు పాల్పడతారని ఏడీసీపీ వివరించారు. మిగతా వారిని విచారణ చేయాల్సి ఉందని, వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. క్రైం సీఐ బీఎస్ఎస్ ప్రకాశ్, ఎస్ఐలు ఉన్నారు.

'అంబేడ్కర్‌ను గౌరవించింది బీజేపీయే'

డాబాగార్డెన్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను గౌరవించింది బీజేపీ అని, ఆ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్యలకు వ్యతిరేకంగా ఆయన దిష్టిబొమ్మకు చెప్పులుదండ వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగానే వాడుకుందన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ పుట్టిన గ్రామం, చదివిన, మరణించిన ప్రాంతాలను ఆయన పేరుతో పంచతీర్థాలుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు రాకేష్ చంద్ర, ఉపాధ్యక్షుడు రాంబాబు, దానేష్, రవికుమార్, నాగరాజు, ఉజాత, నూర్‌బాషా పాల్గొన్నారు.

అడవి.. అంతరిస్తోంది

... 5వ పేజీ తరువాయి

భూభాగంలో అటవీ విస్తీర్ణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రాష్ట్రంలో 55.58 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. తరువాత నగరం ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లా 28.61 శాతంతో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. అటవీశాఖ నమోదుచేసిన ప్రాంతాల్లో చెట్ల సాంద్రత తగ్గడం అంటే (దట్టమైన చెట్లు కొట్టి వ్యవసాయానికి మళ్లించడం) ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు పోడు వ్యవసాయం కోసం అడవులు నరికివేస్తున్నారు. మైదాన ప్రాంతంలోని పొలాల్లో సరుగుడు, మామిడి, టేకు, ఆయిల్‌పాం తోటలు పెంచుతారు. కోతకు వచ్చినవి నరికివేస్తుంటారు. పంట సరిగ్గా రాని మామిడి, జీడి తోటలు తొలగిస్తారు. ఈ సమయంలో అటవీశాఖ సర్వే చేసినప్పుడు శాటిలైట్ ఇమేజ్‌లో అక్కడ ఖాళీ భూములున్నట్టుగా నమోదవుతుంది. దీంతో అటవీ విస్తీర్ణం తగ్గుదల నమోదవుతుంది. ఏటా కోట్ల మొక్కలు నాటినా అటవీ విస్తీర్ణం పెరగకపోవడం ఇప్పటికీ శేషప్రశ్నగా ఓ అధికారి వ్యాఖ్యానించారు.

అగ్నిప్రమాదాల్లో అల్లూరి రెండోస్థానం..

దేశంలోని అడవుల్లో పలుచోట్ల తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇందులో అల్లూరి సీతారామరాజు జిల్లా రెండోస్థానంలో ఉంది. తాజా నివేదిక మేరకు 2022 నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు 6,399 అగ్నిప్రమాదాలు సంభవించాయి. 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 3,639 ప్రమాదాలు సంభవించాయి. అల్లూరి జిల్లాలో శీతాకాలం ముగిసిన తరువాత వాతావరణంలో మార్పుల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 194 అగ్నిప్రమాదాలు సంభవించగా, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు 126కు తగ్గాయి. విశాఖ జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు మూడు, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు నాలుగు ప్రమాదాలు సంభవించాయి.

అర్బన్‌లో విశాఖ ప్రథమ స్థానం

జిల్లాలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు 615.53 చ.కి.మీ. విస్తీర్ణంతో విస్తరించిన విశాఖ నగరం జనసమ్మర్ధంగా ఉంటుంది. అటువంటి మహానగరంలో అడవుల విస్తీర్ణం ఎక్కువ. రాష్ట్రంలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉన్న పట్టణాలు/నగరాల్లో విశాఖపట్నం ప్రథమస్థానంలో ఉంది. నగరంలో 68.59 చ.కి.మీ. విస్తీర్ణంలో మధ్యస్థాయి అడవి ఉండగా ఓపెన్ ఫారెస్టు 114.10 చ.కి.మీ. మేర విస్తరించాయి. మొత్తం 182.69 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉంది. మొత్తంలో అటవీ విస్తీర్ణం 29.68 శాతంగా ఉంది. నగరంలో కంబాలకొండ ఒక్కటే 1400 హెక్టార్లలో విస్తరించింది. జూ, సింహాచలం కొండ, విశాఖ ఉక్కు టౌన్‌షిప్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, పార్కుల్లో లక్షల చెట్లతో పచ్చదనం నిండి ఉంది. హుద్‌హుద్ తరువాత నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడంతో పచ్చదనం పరచుకుంది. వీటన్నింటిని కలిపి ఓపెన్ ఫారెస్టుగా గుర్తిస్తారు. అయినా నగరంలో కాలుష్యం, వేసవిలో వేడి తగ్గాలన్నా మరిన్ని మొక్కలు పెంచాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

'వైసీపీకి కాదు.. పదవికి రాజీనామా చేయాలి'

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ వైఎస్ఆర్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఆయన ముందు విశాఖ డెయిరీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సూచించారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆడారి ఆనంద్ ఒక రాజకీయ ఊసరవెల్లి అని వ్యాఖ్యానించారు. డెయిరీ ఛైర్మన్, 12 మంది డైరెక్టర్లు ఒక సంస్థలో ఉంటూ మూకుమ్మడిగా పార్టీలు మారడం దేశంలో ఇంకెక్కడా జరగదన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మికి ఎంపీ భరత్ పూజలు



మూలవిరాట్టుకు పసుపు నీటితో అభిషేకం చేస్తున్న ఎంపీ శ్రీభరత్

జగదాంబ కూడలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం రాత్రి సందర్శించారు. ఆయనకు ఆలయ సంప్రదాయాలతో ఈవో కె.శోభారాణి స్వాగతం పలికారు. గర్భగుడిలో అమ్మవారి మూలవిరాట్టుకు అర్చకులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అనంతరం తీర్థ ప్రసాదాలుఅందజేశారు. మార్గశిర మాసోత్సవాల్లో భక్తులకు చేపట్టిన ఏర్పాట్లను ఈవో శోభారాణి వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీ సూచించారు. టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రాస్ కంట్రీ పోటీలు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోర్టు స్టేడియంలో జరిగిన ఈ మీట్‌లో వివిధ కేటగిరీలలో సుమారు 150 మంది అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథ స్పోర్ట్సు క్లబ్ అధినేత బుద్ధ కాశీ విశ్వనాథ్ విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారికి రూ. 25 వేలు, అంతర్జాతీయ స్థాయిలో విజేతలకు రూ. 50 వేల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు సీహెచ్.అప్పలరాజు, వివి.రామ్‌కుమార్, డీఎస్‌ఏ కోచ్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: పురుషుల అండర్-20 విభాగంలో ఎంఎస్ఏ.వేదవ్యాస్, వంతల రమేష్, పంగి శ్యామ్....పురుషుల అండర్-18 విభాగంలో ఎం.చిన్న, ఎం.సాయి యశ్వంత్, ఎ.రాజవర్ధన్...అండర్-16 కేటగిరీలో బి.జగదీష్, ఎన్.సాయి విగ్నేష్, వై.సూర్యతేజ అశ్విన్...అండర్-14 విభాగంలో ఎం.జీవన్‌కుమార్, యు.జశ్విన్, యు.అన్వేష్; మహిళల అండర్-20 విభాగంలో కె.దివ్యదుర్గ, వి.జ్యోతిదుర్గ స్వరూప, కె.హేమాంగిని...అండర్-18 విభాగంలో పి.హాసిని, ఆర్.వైశాలి, జి.రోహిణి...అండర్-16 విభాగంలో బి.ప్రవల్లిక రెడ్డి, బి.భార్గవి, సీహెచ్.గాయత్రి లాస్య...అండర్-14 విభాగంలో కె.రాగిణి, కె.కావ్య మూర్తి, కె.లక్ష్మీ అనూష స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

కథలతో చిన్నారుల ఆలోచన శక్తి మెరుగు

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు అర్థం చేసుకునేలా కథలు వినిపించడం, చేతల్లో చూపడం ద్వారా వారి ఆలోచన శక్తి పెంచుకుంటారని కథకురాలు ఆర్.వరలక్ష్మి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మియావాకీ స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది చిన్నారి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్ విజేతలను రెండు వారాల్లో జరగబోయే తదుపరి మియావాకీ స్టోరీ టెల్లింగ్ సెషన్‌కు ఎంపిక చేస్తామన్నారు.

పతక సాధకులకు ఎమ్మెల్యే అభినందన



స్కేటింగ్ విజేతలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం పోలచ్చిలో జరిగిన 62వ జాతీయ క్రీడల్లో రోలర్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన సబ్బవరపు శంకర, బి.కార్తీక శరణ్య, లోహిత్ రెడ్డిలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష శ్రీనివాస్ అభినందించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన పార్టీ కార్యాలయంలో వారిని అభినందించిన ఆయన అంతర్జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికై పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్‌లు పి.సత్యనారాయణ, కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏయూపై ఫోకస్

... 5వ పేజీ తరువాయి

వ్యవహారాలపై ఇప్పటివరకు ప్రభుత్వానికి సుమారు 20 ఫిర్యాదులు అందినట్టు చెబుతున్నారు.

సంజయ్‌పై ఆరా..

మాజీ సీఐడీ చీఫ్ సంజయ్ వర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశారు. ఈ కోర్సు పూర్తిచేసే క్రమంలో పరీక్షలను ఎవరితోనో రాయించారని, ఇందుకు వర్సిటీ ఉన్నతాధికారులు సహకరించారని ఉన్నత విద్యాశాఖ మంత్రికి కొంతమంది ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు. దీనిపై మంత్రి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారంటున్నారు. దీనిపై అంతర్గతంగా విచారణ చేపడుతున్నప్పటికీ, వర్సిటీ ఉన్నతాధికారులు పెదవి విప్పడం లేదు.

నగరంలో వైట్‌టాప్ రోడ్లు!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం సమస్య పరిష్కారానికి శాశ్వతచర్యలు తీసుకోవాలని భావించింది.

రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఇకపై ఒక్కో స్ట్రెచ్‌కు కాకుండా 30 అడుగులు అంతకంటే ఎక్కువ వెడల్పుకలిగిన రోడ్లకు మరమ్మతులు, అవసరమైతే కొత్తలేయర్లు నిర్మాణం కోసం రెండేళ్ల కాలవ్యవధితో గ్లోబల్‌టెండర్ విధానం అమలుచేయాలని నిర్ణయించింది. జీవీఎంసీ పరిధిలో రోడ్ల నిర్మాణం కోసం ఏటా సుమారు రూ.వంద కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐదేళ్లకు రూ.500 కోట్లు వరకూ ఖర్చవుతోంది. అదే మొత్తానికి ఐదేళ్ల నిర్వహణ చూసేలా ఎల్అండ్‌టీ, షాపూర్‌పల్లొంజి, ఎన్‌సీసీ, నవయుగ వంటి పెద్దసంస్థల నుంచి గ్లోబల్ టెండర్ పిలవాలని రాష్ట్రంలోని అన్ని పట్టణస్థానికల సంస్థలకు మౌఖికంగా ఆదేశించింది. జీవీఎంసీ పరిధిలో 30 అడుగులు అంతకంటే వెడల్పు కలిగిన రోడ్లు, వాటి ప్రస్తుత పరిస్థితి తదితర వివరాలతో నివేదిక తయారుచేసి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వానికి పంపించింది. వర్షాకాలంలో నీరునిలిచిపోవడం, భారీవాహనాల వాహనాల రాపిడికి నీరుచేరిన చోట తారు పైకి లేచిపోవడం వల్ల వారం, పది రోజులకే గుంతలు పడుతున్నాయని అధికారులు గుర్తించారు. దీనివల్ల రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించినప్పటికీ ప్రయోజనం లేదని అధికారులు చెబుతున్నారు. సిమ్మెంట్ కాంక్రీట్ మిక్సింగ్ (వైట్‌టాప్)తో రోడ్లను నిర్మిస్తే ఎంతవర్షం నీరు నిలిచినా ఇబ్బంది ఉండదని, పైగా వాహనాల తాకిడిని తట్టుకునే సామర్థ్యం ఎక్కువని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు నగరంలో తొలివిడతగా 25 కిలోమీటర్లు వైట్‌టాప్ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతి లభిస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

స్టూడెంట్ ఫెస్ట్ వేడుకలు

డాబాగార్డెన్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం బ్రాంచ్ ఆఫ్ ది సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆఫ్ ఐసీఏఐ ఆధ్వర్యంలో లుడిపాస్ సికాసా స్టూడెంట్ ఫెస్ట్ 2024 వేడుకలను డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. బ్రాంచ్ ఛైర్మన్ సీఏ అనిర్బన్‌పాల్, సికాసా ఛైర్మన్ సీఏపీ లోకేష్‌లు మాట్లాడుతూ భవిష్యత్‌లో రాణించాల్సిన అంశాలను తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సికాసా గవర్నెన్స్ హెచ్ సీఏ డి.ఉజ్వల, కోశాధికారి బి.డిరపుల్ స్నేహిత, జి.ఉజ్వల, కె.పుష్పక్, సంపత్, ఇషిక తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గీత దాటితే కఠిన చర్యలు : సీఐ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు క్రమశిక్షణ పాటించాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఎ.సత్యనారాయణ హెచ్చరించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు.

బాధ్యతల స్వీకరణ: విశాఖ సిటీ పరిధిలో ఫోర్త్‌టౌన్ సీఐగా అత్మకూరు సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం సీసీఎస్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు సీఐగా బదిలీ అయ్యారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడతామని, నేరాలు జరగకుండా చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ఉక్కు నిర్వీర్యానికి కుట్ర!

... 5వ పేజీ తరువాయి

లేవని చెప్పడం ఇదే తొలిసారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పోటీలకు హాజరైతే తప్పనిసరిగా విశాఖ ఉక్కుకు మెడల్స్ వస్తాయని, దాంతో పాటే పేరు కూడా వస్తుందని, అది ప్రస్తుత యాజమాన్యానికి ఇష్టం లేదని, అందుకే ఇలా చేశారని చెబుతున్నారు.

సీఎండీ విమాన ఖర్చుల సంగతి ఏమిటో...?

ప్రస్తుతం సీఎండీ సక్సేనా ఎంఓఐఎల్ (నాగపూర్)కు చెందిన ఉద్యోగి. డిప్యుటేషన్‌పై విశాఖ ఉక్కులో పనిచేస్తున్నారు. ఆయన వారానికి మూడు, నాలుగు రోజులు ఇక్కడ ఉంటున్నారు. నాగపూర్-ఢిల్లీ-విశాఖపట్నం మధ్య ఎక్కువగా విమాన ప్రయాణాలు చేస్తున్నారు. ముందుగా విమాన టికెట్లు తీసుకుంటే సాధారణ రేటుకు వస్తాయి. ఆకస్మికంగా ప్రయాణం పెట్టుకుంటే రేట్లు అధికంగా ఉంటాయి. అయితే సీఎండీ ఏ ప్రయాణమూ షెడ్యూల్ ప్రకారం కాకుండా, ముందు తీసిన టికెట్లు రద్దుచేయించి అప్పటికప్పుడు వేరే టికెట్లు తీయిస్తున్నారు. దానివల్ల నష్టంతో పాటు, అప్పటికప్పుడు ఎక్కువ రేటు పెట్టి కొనాల్సి వస్తోంది. ఆయన ప్రయాణాలన్నీ అలాగే జరుగుతున్నాయని, మరి వాటి నష్టం ఎవరు భరిస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సొంత ప్రయాణాలకు నచ్చినట్టు ఖర్చులు చేస్తున్న వ్యక్తి, ప్లాంటుకు పేరు తెచ్చే పోటీలకు వెళతామంటే వద్దని ఎందుకు చెబుతున్నారో వెల్లడించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. విశాఖ ఉక్కులో జరుగుతున్న వ్యవహారాలపై తక్షణమే ఉత్తరాంధ్ర ఎంపీలు సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.

☛ సంక్షిప్తంగా..

9న స్టీల్ క్లబ్ ఎన్నికలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్ పాలక వర్గ ఎన్నికలు జనవరి తొమ్మిదిన నిర్వహించేందుకు ఎన్నికల అధికారి బాబూ నాయక్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుత పాలక వర్గం పదవీ కాలం ముగియనుండడంతో నూతన పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జనవరి రెండు వరకు నామినేషన్ల స్వీకరణ, మూడో తేదీ రాత్రి ఎనిమిది గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, తొమ్మిదో తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడున్నర వరకు, మళ్లీ సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ జరగనున్నది. అనంతరం ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

హెల్త్ సిటీలో క్రిస్మస్ సందడి


ఓ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

ఆరిలోవ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ హెల్త్ సిటీలో పలు వైద్యశాలలు క్రిస్మస్ వేడుకల నిర్వహణకు సిద్ధమవుతున్నాయి. తమ ఆస్పత్రుల్లో పని చేసే సిబ్బంది కానుకలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశాయి. ఇప్పటికే క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసి వాటికి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో ఆయా ఆస్పత్రుల వద్ద సందడి నెలకొంది.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్‌లో గోపీచంద్ ప్రతిభ



రామ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో నగరానికి చెందిన దమ్ము గోపీచంద్ తన ప్రతిభ చాటి నాలుగో స్థానంలో నిలిచారు. పశ్చిమ బెంగాల్‌లోని ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో పాల్గొన్న గోపీచంద్ తన ప్రతిభ చాటాడు. గోపీచంద్ ప్రస్తుతం బుల్లయ్య కాలేజీలో ఎంసీఏ చదువుతున్నాడు. గత నాలుగేళ్ల తన తండ్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.. ఇటీవల ఆంధ్రా యూనివర్శిటీలో జరిగిన బాడీబిల్డింగ్‌లో స్వర్ణపతకం సాధించారు. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించటమే తన లక్ష్యమని గోపీచంద్ అంటున్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 36 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 38, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

అబ్బురపరుస్తున్న చిత్రకళా నైపుణ్యం



ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రదర్శనకు ఆదరణ



- కళాఖండాలు, వర్ణ చిత్రాల కొనుగోలుకు సందర్శకుల ఆసక్తి
- 29 వరకు ఎగ్జిబిషన్



వెంకోజీపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థుల సృజనాత్మకత నగర వాసుల మనసు దోచుకొంది. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానులు, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శనలో అద్భుత చిత్రాలు అందుబాటులో ఉంచడంతో పాటు అమ్మకాలు చేశారు. దీంతో కళాభిమానులు ప్రదర్శనను తిలకించి తమకు నచ్చిన కళా చిత్రాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తుండడంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలు, శిల్పాలను రూపొందించే పనిలో నిమగ్నం అవుతున్నారు. విద్యార్థులు ఊహించిన దాని కంటే ఎక్కువ ఆదరణ దీనికి లభిస్తోంది, ఇంటిలో అలంకరణ, బహుమతులుగా ఇవ్వడానికి ఇక్కడ విద్యార్థులు చేసిన కళాఖండాలు, వర్ణ చిత్రాలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు వచ్చి వీటిని తిలకించి తమ మనసుకు నచ్చిన వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. ఈ నెల 29 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఈ ప్రదర్శన ఉంటుంది. విద్యార్థుల ప్రతిభకు నగరవాసుల నుంచి వస్తున్న ఆదరణ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని విభాగాధిపతి డి.సింహాచలం అన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న నగర వాసులు

భళారే.. భస్మాసుర హస్తం


కళాకారుల అభినయం

మద్దిలపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ప్రదర్శించిన మోహిని భస్మాసుర నృత్య రూపకం అలరించింది. ప్రముఖ నాట్యాచారులు హరిరామమూర్తి శిష్యులు భస్మాసుర హస్తం కథను కూచిపూడి నృత్యం ద్వారా వివరించి 'భళా..' అనిపించారు. భస్మాసురుడుగా హరిరామమూర్తి, మోహినిగా సన్నిధ, సుబ్బరాజు శివుడుగా అద్భుతం నృత్యాలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. ఎవరి తలపై చేయిపెడితే వారు భస్మం అయిపోవాలని శివుడు వద్ద వరం పొందిన భస్మాసురుడు, వరాన్ని పరీక్షించడానికి పరమశివుడు తలపైనే చేయి పెట్టాలని ప్రయత్నిస్తాడు. అప్పుడు శివుడు భయంతో పరుగుపెడుతూ విష్ణుమూర్తి శరణు కోరుతాడు. విష్ణుమూర్తి మోహిని రూపంలో భస్మాసురుడిని ఆకట్టుకుని నాట్యం చేసి భస్మాసురుడు తనచేయి తన తలపైనే పెట్టుకునేలా చేసిన అంశాలు నృత్య రూపకంలో ప్రదర్శించి అందరి హర్షధ్వానాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాభారతి నిర్వాహకులు జి.రాంబాబు, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపర్ణకు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు



సౌత్‌ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు అందుకుంటున్న అపర్ణ

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య కళాకారిణి అపర్ణ బెంగళూరు కూచిపూడి మరకతమణి సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు 2024 అందుకున్నారు. మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన ఎస్ఎస్‌బీ అపర్ణ తన నృత్యకౌశల్యాన్ని ప్రదర్శించి ఇటీవల ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పలు అవార్డులు అందుకున్నారు. సుమారు 500 వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. 2008లో జనార్దనరావు, శ్రీదేవి దంపతులకు జన్మించిన ఆమె తొమ్మిదేళ్ల వయస్సులోనే కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభించారు.

గత ఏడేళ్లుగా నృత్య ప్రదర్శనలిస్తూ కూచిపూడి నృత్య ప్రాశస్త్యాన్ని చాటారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, మ్యూజిక్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, ఎక్సలెన్సీ బుక్ ఆఫ్ రికార్డుల్లో తన పేరు నమోదు చేసుకున్నారు. నాట్యబాల పురస్కారం, నాట్య కుసుమల ప్రతిభా పురస్కారం, గరుడ కీర్తి పురస్కారం, నృత్య ప్రతిభా పురస్కారం ఇలా ఎన్నో అవార్డులు అందుకున్నారు. రామ్‌చరణ్ ట్రోఫీలో ప్రత్యేక జ్యూరీ అవార్డు, మిలన్ 2023, 2024లను కూడా తన సొంతం చేసుకుంది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంత్యుత్సవాల్లో పద్మశ్రీ చిరంజీవి చేతుల మీదుగా ప్రత్యేక సన్మానం పొందారు.

ఏడు కేసుల్లో ఆరుగురు చోరుల అరెస్టు

- రూ.5 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు చోరీ కేసులకు సంబంధించి ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.ఐదు లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు ఆదివారం క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి, నరవ, విమాన్‌నగర్ ప్రాంతాల్లో రెండిళ్లల్లో వెండి ఆభరణాలు, కోడిపుంజులు, నాలుగు గ్యాస్ సిలిండెర్లు, వెల్డింగ్ మిషన్, ఎలక్ట్రిక్ మిషన్లు, వైర్ల చోరీకి పాల్పడిన గోపాలపట్నంలోని కొత్తపాలేనికి చెందిన సుశాంత్ సాహా (39), నగరంలోని కొబ్బరితోటకు చెందిన జగన్నాథ్ సాహా(26) లను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

అలాగే పెందుర్తి, అక్కిరెడ్డిపాలెంలలో పది కోళ్లను దొంగిలించిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల రమణ, నాగలూరి నాగరాజు, దొడ్ల ఈశ్వరరావులను అరెస్టు చేసినట్టు వారు తెలిపారు. సుజాతనగర్‌లో గల ఓ జ్యూస్ సెంటర్‌కు చెందిన స్టీల్ కౌంటర్‌ను చోరీ చేసిన చినముషిడివాడకు చెందిన కోనూరు రవిశంకర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఆయా కేసులను పెందుర్తి క్రైమ్ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేసి తక్కువ వ్యవధిలోనే నిందితులను పట్టుకుని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది నాగరాజు, ఎంఎస్ నాయుడు, శ్రీరామ్, భవానీ, శివప్రసాద్, దేవుడు, ఎల్ఎస్ నాయుడు, పైడిరాజులను ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు.


రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్న 14 మంది ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు. చిత్రంలో విజయనగరం జోనల్ ఛైర్మన్ దొన్ను దొర, విశాఖ జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, డీటీసీ ఆదినారాయణ, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

'చెత్త' కష్టాలు!

- చెత్త వేయవద్దంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన జీవీఎంసీ అధికారులు



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫెక్సీలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'చెత్త వేయకండి' అని చెబితే అక్కడి జనం ఆగడం లేదు. 'సూచన బోర్డులు మమ్మల్నేమీ ఆపలేవు' అన్నట్లు అక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తూనే ఉంటుంది. దీనికి చెక్ పెట్టడానికి జీవీఎంసీ కూడా కాస్తా కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జీవీఎంసీ 18వ వార్డులోని డీఆర్‌డీఏకార్యాలయం ఎదురుగా చెత్తాచెదారంతో ఆ ప్రదేశం అధ్వానంగా ఉండేది. ఎప్పటికప్పుడు శుభ్రం చేసినా, పరిస్థితిలో మార్పు ఉండడం లేదు. అందుకని చేత్త వేయరాదు, జరిమానా రూ.1000 అని పెట్టి, ఆ బోర్డులో ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటరు గొలగాని దంపతుల ఫొటోలతో పాటు దేముడి బొమ్మ కూడా పెట్టారు. కనీసం సెంటిమెంట్‌తో అయినా ఇక్కడ చెత్త వేయడం మానేస్తారని అధికారుల భావన కావచ్చు. ఈ ఏర్పాట్లు కొంతవరకూ సఫలం అయినా, బోర్డు పాడైపోతే తర్వాత పరిస్థితి ఏమిటో చూడాల్సిందే!

స్పా సెంటర్‌లో వ్యభిచారం

- పోలీసుల తనిఖీలో గుట్టురట్టు
- అయిదుగురి అరెస్టు
- యువతులు శక్తిసదన్‌కు తరలింపు

మద్దిలపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయింది. వీఐపీ రోడ్డు సీబీఎం కాంపౌండ్‌లోని ఒక భవనం అయిదో ఫ్లోర్‌లో డెవిన్సి థాయ్ స్పా నిర్వహిస్తున్నారు. ఇందులో యువతులకు నగదు ఆశ చూపి వ్యభిచారం చేయిస్తున్నారనే సమాచారంతో త్రీటౌన్ పోలీసులు రైడ్ చేశారు. స్పా సెంటర్‌లో నాలుగు గదుల్లో నలుగురు యువతులతో నలుగురు విటులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. స్పా యజయాని, విటులను ఆదివారం అరెస్టు చేసి యువతులను శక్తిసదన్ హోమ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి.

పిఠాపురంకాలనీ కళాభారతి సమీపంలో నివాసముంటున్న సుతారి వంశీధర్ వీఐపీ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ అయిదో ఫ్లోర్‌లో డెవిన్సి థాయ్ స్పా నిర్వహిస్తున్నాడు. స్పా సెంటర్‌కు వచ్చే పురుషులను కోరుకున్న విధంగా మసాజ్ చేయిస్తుంటారు. అయితే అతడు అందమైన యువతులకు నగదు ఆశ చూపి వ్యభిచారంలోకి దింపుతున్నాడు. పురుషులకు మసాజ్‌తో పాటు అదనంగా డబ్బులిస్తే యువతులతో శారీరకంగా కలవొచ్చని చెప్పి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా స్పా సెంటర్‌లో నాలుగు గదుల్లో బెడ్‌లు వేసి నలుగురు యువతులను పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు శనివారం రాత్రి స్పా సెంటర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో నాలుగు గదుల్లో నలుగురు విటులు యువతులతో వ్యభిచారం నిర్వహిస్తుండగా పట్టుకున్నారు.వ్యభిచారానికి పాల్పడుతున్న నలుగురు యువతులను శక్తిసదన్ హోంకు తరలించారు. స్పా యజమాని సుతారి వంశీధర్, విటులు గునబత్తుల కృష్ణమోహన్, కొల్లిమల్ల దివాకర్, మల్లా కల్యాణ్, హరిదాసు శ్రీహర్షలను ఆదివారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి రిమాండ్ విధించారు.


మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

రవాణా శాఖ మంత్రికి ఎన్ఎంయూఏ సత్కారం

ద్వారకా బస్‌స్టేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖా మంత్రి ఎం. రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఎన్ఎంయూఏ రాష్ట్ర, రీజనల్ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ విశాఖపట్నం డిపోలో నూతన బస్సుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ దొన్నుదొరను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం. సురేశ్‌నాయుడు, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు బి. నీలకంఠం, గండి రామకృష్ణ, జిల్లా కమిటీ ఛైర్మన్ ఫ్రాన్, డివిజన్ కార్యదర్శి ఏకే శివాజీ పాల్గొన్నారు.

26 నుంచి వేంకటేశ్వర ఉదయాస్తమాన సేవలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు డీఆర్‌డీఏ సమీపంలోని ఎంవీ భద్రం కమ్యూనిటీ హాలులో ఈ నెల 26 నుంచి 29 వరకూ శ్రీవేంకటేశ్వర ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు రుషిపీఠం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటలకు సుప్రభాతంతో ప్రారంభమై అర్చన, తోమాల సేవ, కల్యాణం, తిరువీధోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు పవళింపు సేవలను భక్తులు ప్రత్యక్షంగా ఇక్కడ వీక్షించవచ్చని సంస్థ తెలిపింది. అందరూ ఆహ్వానితులేనని, ప్రసాదం ఉచితంగా అందజేస్తారని పేర్కొంది. 26న సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఊరేగింపుతో ప్రారంభమయ్యే శ్రీవేంకటేశ్వర స్వామివారి ఉదయాస్తమాన సేవ 29న రాత్రి 8.30 గంటలకు పూర్తవుతుందని, తిరుమల నియమాల మాదిరిగానే సంప్రదాయ వస్త్రధారణతో భక్తులు రావాలని తెలిపింది. ప్రతి రోజూ ఆకెళ్ల విభీషణ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు, అన్నమయ్య సంకీర్తనలు, నాదనీరాజనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. ఇతర వివరాలకు అరుణ గాయత్రి ఫోన్: 91608 85953లో సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది.

జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షుడిగా రామకృష్ణ


జేసీఐ విశాఖవ్యాలీ అధ్యక్షుడు కొంకిపూడి రామకృష్ణ, సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ వ్యాలీ నూతన అధ్యక్షుడిగా కొంకిపూడి రామకృష్ణ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆయన నగరంలోని లయన్స్ క్లబ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ అధ్యక్షుడు ఎ. సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కీ నోట్ స్పీకరుగా కేవీరావు, గౌరవ అతిథిగా జోనల్ ఉపాధ్యక్షుడు కేపీ కల్యాణ్, ప్రత్యేక అతిథులుగా రాంసూర్య కొల్లూరు, సింధూర తాడి హాజరయ్యారు. పదవీ స్వీకరణ అనంతరం ఈఏడాది జేసీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు అంశాలపై రామకృష్ణ మీడియాకు వివరించారు. అన్ని రంగాల వారికి సేవలందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం చిత్తు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ప్రొఫెసర్ హరినాథ్


వెంకోజీపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనం అవుతుందని ఏయూ ఆర్ట్స్ కళాశాల చీఫ్ వార్డెన్ ఎస్.హరినాథ్ అన్నారు. మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకంలో ఏయూను డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకర అలవాట్లు కలిగి ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్‌లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని విద్యార్థులకు వివరించారు.

ఏయూ ఇంటర్ యూనివర్సిటీ యోగా జట్టు ఎంపిక


అంతర్ వర్సిటీ యోగా పోటీలకు ఎంపికైన ఏయూ యోగా జట్టు

వెంకోజీపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంటర్ యూనివర్సిటీ యోగా ఏయూ పురుషులు, మహిళలు జట్ల ఎంపికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ దూర విద్యాకేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనివర్సిటీ యోగా పోటీలు భువనేశ్వర్‌లో కిట్స్ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28 వరకు యోగాలోని వివిధ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. యోగాలో ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. యోగా కోచ్ వర్మ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో ప్యానెల్-2 విజయం


గెలిచిన ప్యానల్-2 ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లాకు ఎంవీపీ కాలనీ గిరిజన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్యానెల్ 2 విజయం సాధించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న గిరిజన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసు, జీసీసీ, రైల్వే, సచివాలయం, పోర్టు ట్రస్టు, డాక్‌యార్డు, ఆర్ఐఎన్ఎల్, జీవీఎంసీ తదితర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు ఉదయం నుంచి గిరిజన్ భవన్ ముందు సందడి చేశారు. సంఘంలో మొత్తం 2234 మంది సభ్యులు కాగా, 1469 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యానెల్ 1 అరటి పండు గుర్తుతో డిప్పల సాంబమూర్తి అధ్యక్షుడిగా పోటీ చేయగా, ప్యానెల్ 2 గాలిపటం గుర్తుతో ఎస్.అప్పలరాజు పోటీలో పోటీ పడ్డారు. ఈ ఎన్నికలో 81 ఓట్ల తేడాతో ప్యానెల్ 2 విజయం సాధించింది.

వేదసారంపై పండిత గోష్ఠి


గోష్ఠిలో పాల్గొన్న వేదపండితులు

జగదాంబ కూడలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం వేదసభ, అర్చక సదస్సులో పండితులు వేద సారాంశాన్ని, విలువల గొప్పతనాన్ని వివరించారు. చతుర్వేదాలు, వైఖానస, స్మార్తం, శైవాగం, పాంచరాత్రం ఆగమనాలపై వేదపండితులు ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 21 మంది వేదపండితులు, 21 మంది అర్చకులు పాల్గొన్నారు. దేవస్థానం వేదపండితులు ముష్టి భీమశంకర శాస్త్రి, వేంకటేశ్వర ఘనాపాఠి, చావలి లక్ష్మీనారాయణ అవధాని, కోట పంచముఖి శర్మలు పలు అంశాలపై మాట్లాడారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండమంచిలి శ్రీనివాస శర్మ, బీఎస్ఎస్ భట్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవో కె.శోభారాణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో క్రిస్మస్ అలంకరణల సందడి


మహరాణిపేటలో అలంకరణ వస్తువులతో దుకాణం

మహారాణిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అన్ని ప్రధాన చర్చిలలో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు తమ ఇళ్లను అలంకరిస్తున్నారు. దీంతో అలంకరణ వస్తు సామగ్రి అమ్మకాలు ఊపందుకున్నాయి. క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్‌కు సుమారు పది రోజులు ముందుగానే వేడుకలు ప్రారంభిస్తారు. ఇంటిలో పశువుల పాక, క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేసుకొని విద్యుత్ దీపాలంకరణతో స్టార్‌ను ఆవరణలో వేలాడదీశారు. నగరంలోని మహారాణిపేటలో వందేళ్ల చరిత్ర కలిగిన సెయింట్ ఆంథోనీ చర్చి సమీపంలో క్రిస్మస్ అలంకరణ సామగ్రిని ఏటా విక్రయిస్తారు. పెద్దసంఖ్యలో క్రిస్టియన్లు ఇక్కడకే వచ్చి కొనుగోలు చేస్తారు. ఇక్కడ వినూత్న వస్తువులు, విద్యుత్ వెలుగులతో కూడిన క్రిస్మస్ చెట్లు, స్టార్స్, లైటింగ్ స్టార్స్, శాంతక్లాజ్ డ్రెస్‌లు, బెల్స్, రీట్స్ చమ్కీలు, పశువుల పాకల సెట్‌లు, ప్లాస్టిక్ బొమ్మలు తదితర వస్తువులు ఒకేచోట లభ్యమవుతాయి. ఇంకా పండుగకు రెండు రోజులే గడువు ఉండడంతో అలంకరణ వస్తువుల అమ్మకాలు శనివారం నుంచి ఊపందుకుంటాయి.

పనోరమ హిల్స్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

» ఒకరి అరెస్టు - రూ. 5 లక్షలు స్వాధీనం » క్రైం ఏడీసీపీ వెంకట్రావు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ ఎ.వెంకట్రావు, చిత్రంలో సీఐ ప్రకాశ్, ఎస్ఐలు

ఎండాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎండాడ పనోరమ హిల్స్‌లో జరిగిన చోరీ కేసును పీఎంపాలెం క్రైం పోలీసులు ఛేదించారు. ఈమేరకు ఆదివారం పీఎంపాలెం స్టేషన్‌లో ఏడీసీపీ (క్రైమ్) ఎ. వెంకట్రావు కేసు వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8న పనోరమ హిల్స్‌లోని 43/ఎ నంబర్ గల విల్లాలో దొంగతనం జరిగింది. కేజీహెచ్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్న సీతా మహాలక్ష్మీ భీమవరంలోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1,040 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 లక్షల నగదు అపహరణకు గురైంది. సంఘటన జరిగిన ప్రదేశంలో సేకరించిన చేతి వేలిముద్రల ఆధారంగా చోరీ చేసిన వ్యక్తి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కుందన్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. శనివారం ఎండాడ న్యాయ కళాశాల రోడ్డులో అతడ్ని అరెస్టు చేసి రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారు ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి రెక్కీ నిర్వహించి, దొంగతనాలకు పాల్పడతారని ఏడీసీపీ వివరించారు. మిగతా వారిని విచారణ చేయాల్సి ఉందని, వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. క్రైం సీఐ బీఎస్ఎస్ ప్రకాశ్, ఎస్ఐలు ఉన్నారు.

తూర్పుకోస్తా రైల్వేకు పురస్కారం


ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి పురస్కారం అందుకుంటున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వేకు 2024 వార్షిక సంవత్సరానికి ఉత్తమ అతి విద్యుత్ ఇంజనీరింగ్ ప్రతిభా పురస్కారం లభించింది. వివిధ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రోటోకాల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్ ఝా, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.హరిప్రియ, టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగి సుప్రభాత్ మిత్రలకు సంయుక్తంగా ఉత్తమ అతి విశిష్ట రైలు సేవా పురస్కారం పొందారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి ఈ అవార్డులు అందుకున్నారు. పురస్కార గ్రహీతలను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహు అభినందించారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

కంచరపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఆదివారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల, పలు ప్రైవేటు పాఠశాలల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌కు ఘనంగా నివాళులర్పించారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని గణిత దినోత్సవంగా పాటిస్తారు. అతి చిన్న వయసులో ఎన్నో గణిత ఆవిష్కరణలు చేసిన మహనీయుడు రామానుజన్ అని కొనియాడారు. రామానుజన్ చిత్రపటానికి కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పూలమాల వేసి నివాళులర్పించారు.

25న సినీ గీతాల పోటీ

డాబాగార్డెన్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సినీ సంగీత సేవా సంస్థ మెలోడి క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25న 15 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు యువతీ యువకులకు సెమి క్లాసికల్ సినీ గీతాల పోటీ నిర్వహిస్తున్నట్టు సంస్థ కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో విజేతలతో భవిష్యత్తులో ఆర్కెస్ట్రాలో పాటలు పాడిస్తామన్నారు. ఔత్సాహికులు ఈ నెల 24లోగా సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణను ఫోన్ (92466 22563)లో సంప్రదించాలని సూచించారు.

'పర్యావరణ హిత భోగీ మంట వేద్దాం'

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో భోగీ మంటను పర్యావరణ హితంగా లక్షా ఒక్క పిడకలతో వేద్దామని శాసనమండలి మాజీ సభ్యుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గురుద్వార సమీపంలోని కేశవ సేవా సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భోగీ పండుగ పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు కాల్చి అనారోగ్యం తీసుకురావద్దన్నారు. బియ్యం పిండి, పసుపు, కంకుమలతో ముగ్గులు వెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి అశోక్ సత్యా, మధుసూదన్‌రెడ్డి, జేవీ రత్నం పాల్గొన్నారు.

మందుబాబుల హల్‌చల్

మహారాణిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. కేజీహెచ్‌లో ప్రైవేట్‌గా పనిచేస్తున్న కొందరు రాత్రి సమయంలో జల్సా చేస్తున్నారు. ఆసుపత్రిలోనే తాగి అల్లరి చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆదివారం సాయంత్రం కూడా అల్లరి చేయడంతో పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

'అంబేడ్కర్‌ను గౌరవించింది బీజేపీయే'

డాబాగార్డెన్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను గౌరవించింది బీజేపీ అని, ఆ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్యలకు వ్యతిరేకంగా ఆయన దిష్టిబొమ్మకు చెప్పులుదండ వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగానే వాడుకుందన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ పుట్టిన గ్రామం, చదివిన, మరణించిన ప్రాంతాలను ఆయన పేరుతో పంచతీర్థాలుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు రాకేష్ చంద్ర, ఉపాధ్యక్షుడు రాంబాబు, దానేష్, రవికుమార్, నాగరాజు, ఉజాత, నూర్‌బాషా పాల్గొన్నారు.

అడవి.. అంతరిస్తోంది

... 5వ పేజీ తరువాయి

భూభాగంలో అటవీ విస్తీర్ణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రాష్ట్రంలో 55.58 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. తరువాత నగరం ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లా 28.61 శాతంతో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. అటవీశాఖ నమోదుచేసిన ప్రాంతాల్లో చెట్ల సాంద్రత తగ్గడం అంటే (దట్టమైన చెట్లు కొట్టి వ్యవసాయానికి మళ్లించడం) ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు పోడు వ్యవసాయం కోసం అడవులు నరికివేస్తున్నారు. మైదాన ప్రాంతంలోని పొలాల్లో సరుగుడు, మామిడి, టేకు, ఆయిల్‌పాం తోటలు పెంచుతారు. కోతకు వచ్చినవి నరికివేస్తుంటారు. పంట సరిగ్గా రాని మామిడి, జీడి తోటలు తొలగిస్తారు. ఈ సమయంలో అటవీశాఖ సర్వే చేసినప్పుడు శాటిలైట్ ఇమేజ్‌లో అక్కడ ఖాళీ భూములున్నట్టుగా నమోదవుతుంది. దీంతో అటవీ విస్తీర్ణం తగ్గుదల నమోదవుతుంది. ఏటా కోట్ల మొక్కలు నాటినా అటవీ విస్తీర్ణం పెరగకపోవడం ఇప్పటికీ శేషప్రశ్నగా ఓ అధికారి వ్యాఖ్యానించారు.

అగ్నిప్రమాదాల్లో అల్లూరి రెండోస్థానం..

దేశంలోని అడవుల్లో పలుచోట్ల తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇందులో అల్లూరి సీతారామరాజు జిల్లా రెండోస్థానంలో ఉంది. తాజా నివేదిక మేరకు 2022 నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు 6,399 అగ్నిప్రమాదాలు సంభవించాయి. 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 3,639 ప్రమాదాలు సంభవించాయి. అల్లూరి జిల్లాలో శీతాకాలం ముగిసిన తరువాత వాతావరణంలో మార్పుల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 194 అగ్నిప్రమాదాలు సంభవించగా, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు 126కు తగ్గాయి. విశాఖ జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు మూడు, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు నాలుగు ప్రమాదాలు సంభవించాయి.

అర్బన్‌లో విశాఖ ప్రథమ స్థానం

జిల్లాలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు 615.53 చ.కి.మీ. విస్తీర్ణంతో విస్తరించిన విశాఖ నగరం జనసమ్మర్ధంగా ఉంటుంది. అటువంటి మహానగరంలో అడవుల విస్తీర్ణం ఎక్కువ. రాష్ట్రంలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉన్న పట్టణాలు/నగరాల్లో విశాఖపట్నం ప్రథమస్థానంలో ఉంది. నగరంలో 68.59 చ.కి.మీ. విస్తీర్ణంలో మధ్యస్థాయి అడవి ఉండగా ఓపెన్ ఫారెస్టు 114.10 చ.కి.మీ. మేర విస్తరించాయి. మొత్తం 182.69 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉంది. మొత్తంలో అటవీ విస్తీర్ణం 29.68 శాతంగా ఉంది. నగరంలో కంబాలకొండ ఒక్కటే 1400 హెక్టార్లలో విస్తరించింది. జూ, సింహాచలం కొండ, విశాఖ ఉక్కు టౌన్‌షిప్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, పార్కుల్లో లక్షల చెట్లతో పచ్చదనం నిండి ఉంది. హుద్‌హుద్ తరువాత నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడంతో పచ్చదనం పరచుకుంది. వీటన్నింటిని కలిపి ఓపెన్ ఫారెస్టుగా గుర్తిస్తారు. అయినా నగరంలో కాలుష్యం, వేసవిలో వేడి తగ్గాలన్నా మరిన్ని మొక్కలు పెంచాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

సంప్రదాయబద్ధంగా ధనుర్మాసోత్సవాలు



సింహాచలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింహ గిరిపై, కొండదిగువ పద్మావతి, అలిమేల్ మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తిని గోదాదేవిగా స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానం గా అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఉంచారు. పండితుల వేదమంత్రోచ్చారణలు, ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ బేడా మండ పం తిరువీధి జరిపారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో ఆండాళ్ రచించిన తిరుప్పావైలోని ఏడవ పాశురాన్ని పండితులు అనుసంధానం చేశారు.

'వైసీపీకి కాదు.. పదవికి రాజీనామా చేయాలి'

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ వైఎస్ఆర్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఆయన ముందు విశాఖ డెయిరీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సూచించారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆడారి ఆనంద్ ఒక రాజకీయ ఊసరవెల్లి అని వ్యాఖ్యానించారు. డెయిరీ చైర్మన్, 12 మంది డైరెక్టర్లు ఒక సంస్థలో ఉంటూ మూకుమ్మడిగా పార్టీలు మారడం దేశంలో ఇంకెక్కడా జరగదన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మికి ఎంపీ భరత్ పూజలు


మూలవిరాట్టుకు పసుపు నీటితో అభిషేకం చేస్తున్న ఎంపీ శ్రీభరత్

జగదాంబ కూడలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం రాత్రి సందర్శించారు. ఆయనకు ఆలయ సంప్రదాయాలతో ఈవో కె.శోభారాణి స్వాగతం పలికారు. గర్భగుడిలో అమ్మవారి మూలవిరాట్టుకు అర్చకులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అనంతరం తీర్థ ప్రసాదాలుఅందజేశారు. మార్గశిర మాసోత్సవాల్లో భక్తులకు చేపట్టిన ఏర్పాట్లను ఈవో శోభారాణి వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీ సూచించారు. టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రాస్ కంట్రీ పోటీలు


విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోర్టు స్టేడియంలో జరిగిన ఈ మీట్‌లో వివిధ కేటగిరీలలో సుమారు 150 మంది అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బుద్ధ కాశీ విశ్వనాథ్ విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారికి రూ. 25 వేలు, అంతర్జాతీయ స్థాయిలో విజేతలకు రూ. 50 వేల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు సీహెచ్.అప్పలరాజు, వివి.రామ్‌కుమార్, డీఎస్ఏ కోచ్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: పురుషుల అండర్-20 విభాగంలో ఎంఎస్ఏ.వేదవ్యాస్, వంతల రమేష్, వంగి శ్యామ్....పురుషుల అండర్-18 విభాగంలో ఎం.చిన్న, ఎం.సాయి యశ్వంత్, ఎ.రాజవర్ధన్...అండర్-16 కేటగిరీలో బి.జగదీష్, ఎన్.సాయి విగ్నేష్, వై.సూర్యతేజ అశ్విన్...అండర్-14 విభాగంలో ఎం.జీవన్‌కుమార్, యు.జశ్విన్, యు.అన్వేష్; మహిళల అండర్-20 విభాగంలో కె.దివ్యదుర్గ, వి.జ్యోతిదుర్గ స్వరూప, కె.హేమాంగిని...అండర్-18 విభాగంలో పి.హాసిని, ఆర్.వైశాలి, జి.రోహిణి...అండర్-16 విభాగంలో బి.ప్రవల్లిక రెడ్డి, బి.భార్గవి, సీహెచ్.గాయత్రి లాస్య..అండర్-14 విభాగంలో కె.రాగిణి, కె.కావ్య మూర్త, కె.లక్ష్మీ అనూష స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

కథలతో చిన్నారుల ఆలోచన శక్తి మెరుగు

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు అర్థం చేసుకునేలా కథలు వినిపించడం, చేతల్లో చూపడం ద్వారా వారి ఆలోచన శక్తి పెంచుకుంటారని కథకురాలు ఆర్.వరలక్ష్మి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మియావాకీ స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది చిన్నారి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్ విజేతలను రెండు వారాల్లో జరగబోయే తదుపరి మియావాకీ స్టోరీ టెల్లింగ్ సెషన్‌కు ఎంపిక చేస్తామన్నారు.

పతక సాధకులకు ఎమ్మెల్యే అభినందన



స్కేటింగ్ విజేతలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం పోలచ్చిలో జరిగిన 62వ జాతీయ క్రీడల్లో రోలర్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన సబ్బవరపు శంకర, బి.కార్తీక శరణ్య, లోహిత్ రెడ్డిలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష శ్రీనివాస్ అభినందించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన పార్టీ కార్యాలయంలో వారిని అభినందించిన ఆయన అంతర్జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికై పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్‌లు పి.సత్యనారాయణ, కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఫెస్ట్ వేడుకలు

డాబాగార్డెన్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం బ్రాంచ్ ఆఫ్ ది సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆఫ్ ఐసీఏఐ ఆధ్వర్యంలో లుడిపాస్ సికాసా స్టూడెంట్ ఫెస్ట్ 2024 వేడుకలను డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. బ్రాంచ్ చైర్మన్ సీఏ అనిర్బన్‌పాల్, సికాసా చైర్మన్ సీఏపీ లోకేష్‌లు మాట్లాడుతూ భవిష్యత్‌లో రాణించాల్సిన అంశాలను తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సికాసా గవర్నెన్స్ హెచ్ సీఏ డి.ఉజ్వల, కోశాధికారి బి.డిరపుల్ స్నేహిత, జి.ఉజ్వల, కె.పుష్పక్, సంపత్, ఇషిక తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గీత దాటితే కఠిన చర్యలు : సీఐ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు క్రమశిక్షణ పాటించాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఎ.సత్యనారాయణ హెచ్చరించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు.

బాధ్యతల స్వీకరణ: విశాఖ సిటీ పరిధిలో పోర్ట్‌టౌన్ సీఐగా అత్మకూరు సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం సీసీఎస్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు సీఐగా బదిలీ అయ్యారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడతామని, నేరాలు జరగకుండా చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ఏయూపై ఫోకస్

... 5వ పేజీ తరువాయి

వ్యవహారాలపై ఇప్పటివరకు ప్రభుత్వానికి సుమారు 20 ఫిర్యాదులు అందినట్టు చెబుతున్నారు.

సంజయ్‌పై ఆరా..

మాజీ సీఐడీ చీఫ్ సంజయ్ వర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశారు. ఈ కోర్సు పూర్తిచేసే క్రమంలో పరీక్షలను ఎవరితోనో రాయించారని, ఇందుకు వర్సిటీ ఉన్నతాధికారులు సహకరించారని ఉన్నత విద్యాశాఖ మంత్రికి కొంతమంది ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు. దీనిపై మంత్రి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారంటున్నారు. దీనిపై అంతర్గతంగా విచారణ చేపడుతున్నప్పటికీ, వర్సిటీ ఉన్నతాధికారులు పెదవి విప్పడం లేదు.

నగరంలో వైట్‌టాప్ రోడ్లు!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం సమస్య పరిష్కారానికి శాశ్వతచర్యలు తీసుకోవాలని భావించింది.

రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఇకపై ఒక్కో స్ట్రెచ్‌కు కాకుండా 30 అడుగులు అంతకంటే ఎక్కువ వెడల్పుకలిగిన రోడ్లకు మరమ్మతులు, అవసరమైతే కొత్తలేయర్లు నిర్మాణం కోసం రెండేళ్ల కాలవ్యవధితో గ్లోబల్‌టెండర్ విధానం అమలుచేయాలని నిర్ణయించింది. జీవీఎంసీ పరిధిలో రోడ్ల నిర్మాణం కోసం ఏటా సుమారు రూ.వంద కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐదేళ్లకు రూ.500 కోట్లు వరకూ ఖర్చవుతోంది. అదే మొత్తానికి ఐదేళ్ల నిర్వహణ చూసేలా ఎల్‌అండ్‌టీ, షాపూర్‌పల్లొంజి, ఎన్‌సీసీ, నవయుగ వంటి పెద్దసంస్థల నుంచి గ్లోబల్ టెండర్ పిలవాలని రాష్ట్రంలోని అన్ని పట్టణస్థానికల సంస్థలకు మౌఖికంగా ఆదేశించింది. జీవీఎంసీ పరిధిలో 30 అడుగులు అంతకంటే వెడల్పు కలిగిన రోడ్లు, వాటి ప్రస్తుత పరిస్థితి తదితర వివరాలతో నివేదిక తయారుచేసి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వానికి పంపించింది. వర్షాకాలంలో నీరునిలిచిపోవడం, భారీవాహనాల వాహనాల రాపిడికి నీరుచేరిన చోట తారు పైకి లేచిపోవడం వల్ల వారం, పది రోజులకే గుంతలు పడుతున్నాయని అధికారులు గుర్తించారు. దీనివల్ల రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించినప్పటికీ ప్రయోజనం లేదని అధికారులు చెబుతున్నారు. సిమ్మెంట్ కాంక్రీట్ మిక్సింగ్ (వైట్‌టాప్)తో రోడ్లను నిర్మిస్తే ఎంతవర్షం నీరు నిలిచినా ఇబ్బంది ఉండదని, పైగా వాహనాల తాకిడిని తట్టుకునే సామర్థ్యం ఎక్కువని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు నగరంలో తొలివిడతగా 25 కిలోమీటర్లు వైట్‌టాప్ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతి లభిస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ఉక్కు నిర్వీర్యానికి కుట్ర!

... 5వ పేజీ తరువాయి

లేవని చెప్పడం ఇదే తొలిసారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పోటీలకు హాజరైతే తప్పనిసరిగా విశాఖ ఉక్కుకు మెడల్స్ వస్తాయని, దాంతో పాటే పేరు కూడా వస్తుందని, అది ప్రస్తుత యాజమాన్యానికి ఇష్టం లేదని, అందుకే ఇలా చేశారని చెబుతున్నారు.

సీఎండీ విమాన ఖర్చుల సంగతి ఏమిటో...?

ప్రస్తుతం సీఎండీ సక్సేనా ఎంఓఐఎల్ (నాగపూర్)కు చెందిన ఉద్యోగి. డిప్యుటేషన్‌పై విశాఖ ఉక్కులో పనిచేస్తున్నారు. ఆయన వారానికి మూడు, నాలుగు రోజులు ఇక్కడ ఉంటున్నారు. నాగపూర్-ఢిల్లీ-విశాఖపట్నం మధ్య ఎక్కువగా విమాన ప్రయాణాలు చేస్తున్నారు. ముందుగా విమాన టికెట్లు తీసుకుంటే సాధారణ రేటుకు వస్తాయి. ఆకస్మికంగా ప్రయాణం పెట్టుకుంటే రేట్లు అధికంగా ఉంటాయి. అయితే సీఎండీ ఏ ప్రయాణమూ షెడ్యూల్ ప్రకారం కాకుండా, ముందు తీసిన టికెట్లు రద్దుచేయించి అప్పటికప్పుడు వేరే టికెట్లు తీయిస్తున్నారు. దానివల్ల నష్టంతో పాటు, అప్పటికప్పుడు ఎక్కువ రేటు పెట్టి కొనాల్సి వస్తోంది. ఆయన ప్రయాణాలన్నీ అలాగే జరుగుతున్నాయని, మరి వాటి నష్టం ఎవరు భరిస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సొంత ప్రయాణాలకు నచ్చినట్టు ఖర్చులు చేస్తున్న వ్యక్తి, ప్లాంటుకు పేరు తెచ్చే పోటీలకు వెళతామంటే వద్దని ఎందుకు చెబుతున్నారో వెల్లడించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. విశాఖ ఉక్కులో జరుగుతున్న వ్యవహారాలపై తక్షణమే ఉత్తరాంధ్ర ఎంపీలు సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.

9న స్టీల్ క్లబ్ ఎన్నికలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్ పాలకవర్గ ఎన్నికలు జనవరి తొమ్మిదిన నిర్వహించేందుకు ఎన్నికల అధికారి బాబూ నాయక్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుత పాలక వర్గం పదవీ కాలం ముగియనుండడంతో నూతన పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జనవరి రెండు వరకు నామినేషన్ల స్వీకరణ, మూడో తేదీ రాత్రి ఎనిమిది గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, తొమ్మిదో తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడున్నర వరకు, మళ్లీ సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ జరగనున్నది. అనంతరం ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

రైతు బజారులో తనిఖీలు

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రైతుబజారులో ఆదివారం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి సందర్శించారు.

ఈ సందర్భంగా రాయితీ కందిపప్పు, బియ్యం విక్రయాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. కిలో రూ.169 రాయితీ కందిపప్పు, కిలో రూ.49 బియ్యం నాణ్యతను పరిశీలించారు. రైతు బజారులో గల అన్ని స్టాల్స్‌లోని కాటాలు, తూనిక రాళ్లు, మిషన్లను తనిఖీ చేశారు. తూనికల్లో ఎవరైనా మోసాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు బజారు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎస్టేట్ అధికారి వీఎస్పీ షర్మిల, సహాయకుడు చిన్న బ్బాయ్ ఉన్నారు.

సీపీఐ శత వసంతాల సంచిక ఆవిష్కరణ

పెదగంట్యాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఈ నెల 26 నాటికి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగిడుతున్నట్టు సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో ఇందుకు సంబంధించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ సాయంత్రం బీచ్‌రోడ్డులోని అల్లూరి విగ్రహం నుంచి ఆర్‌కే బీచ్ వరకు సీపీఐ కార్యకర్తలు కవాతు నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనవలసిందిగా కోరారు. సమావేశంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, ఎ.విష్ణుమూర్తి, పి.దుర్గారావు, కె.పోతయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప తిరుయాత్ర

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం తిరుయాత్రను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వాహనంపై అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశాక రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, భక్తుల శరణుఘోషతో అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్, హరిజన జగ్గయ్యపాలెం, షీలానగర్ కాలనీలలో ఈ యాత్ర సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్‌పీ నాయుడు , శేషగిరిరావు, నాగార్జున, రామకృష్ణ, నంబారు రాజు, విశ్వేశ్వరరావు, కె.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 36 దొండకాయలు 44, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు(కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 38, కొండచిరి 55, కరివేపాకు (కిలో)60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, కర్రపెండలం 28, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

విశాఖ ఎంపీ శ్రీభరత్



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ శ్రీభరత్

గోపాలపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. గోపాలపట్నంలోని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీభరత్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్హులకు సీఎం సహాయ నిధిని అందించకపోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్‌కు పూర్వ వైభవం వచ్చిందని పేర్కొన్నారు.

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి వల్ల వేలాది మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 19 మంది బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి రూ.28 లక్షల చెక్కులను ఎంపీ శ్రీభరత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రూ.25 కోట్లతో గ్రామీణ రోడ్లు

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



జెర్రిపోతులపాలెంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిధులు కొరత ఉన్నప్పటికీ సీఎం, డిప్యూటీ సీఎంలతో చర్చించి నిధులు రాబట్టడంతో పెందుర్తి నియోజకవర్గంలో రూ.25 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని జెర్రిపోతులపాలెంలో ఉపాధి నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. ఈ క్రమంలోనే మండలంలో ఉపాధి నిధులు రూ.5.5 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను శంకుస్థాపనలతో సరిపెట్టకుండా సంక్రాంతి పండగకల్లా పూర్తి స్థాయిలో ప్రారంభోత్సవాలు చేపడతామన్నారు. ముందుగా ఎమ్మెల్యే రమేశ్‌బాబును పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మడక అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మదుపాడ నాగమణి, మాజీ వైస్ ఎంపీపీ ఎం.పార్వతి, జనసేన మండల అధ్యక్షుడు కొరుపోలు రామునాయుడు, మడక రాము, బి.హరగోపాల్, ఒబ్బిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌పురంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న గండి బాబ్జీ, తదితరులు



గాజువాకలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాసరావు

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తోందని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. మండలంలోని ఎస్‌ఆర్‌పురంలో ఆదివారం ఆయన టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.వంద సభ్యత్వ రుసుముతో రూ.ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని కార్యాకర్తలకు కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యకర్తలు, వారి కుటుంబాల గురించి ఆలోచించే ఏకైక పార్టీ తమదేనన్నారు. టీడీపీ సభ్యత్వంతో గౌరవం లభిస్తుందన్నారు. అంతకుముందు టీడీపీ నాయకులు గండి బాబ్జీని దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పార్టీ సీనియర్ నాయకుడు దూది రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దూది సుందరమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాడి వెంకటరమణ (పులి), నాయకులు జి.గణేశ్, జె.రాజశేఖర్, యర్రా రమణ, బల్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వమంటే గౌరవం: 'ప్రసాదుల'

గాజువాక: తెలుగుదేశం పార్టీ సభ్యత్వమంటే ఓ గౌరవమని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో 76,89,103 మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల్లో ఇదే అత్యధికమని, ఇది ప్రజా విజయమన్నారు. పార్టీపై నమ్మకంతో ప్రజలు సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. ఇది చారిత్రాత్మక విషయమని, పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేయటమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు తమిర శివప్రసాదరావు, పి.వెంకటేశ్వరరావు, అంగ కృష్ణ, రతన్‌కాంత్, దాట్ల శ్రీనివాసరాజు, డి.వెంకట సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడు చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు

రూ.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు చోరీ కేసులకు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.ఐదు లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు ఆదివారం క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి, నరవ, విమాన్‌నగర్ ప్రాంతాల్లో రెండిళ్లల్లో వెండి ఆభరణాలు, కోడిపుంజులు, నాలుగు గ్యాస్ సిలిండెర్లు, వెల్డింగ్ మిషన్, ఎలక్ట్రిక్ మిషన్లు, వైర్ల చోరీకి పాల్పడిన గోపాలపట్నంలోని కొత్తపాలేనికి చెందిన సుశాంత్ సాహూ (39), నగరంలోని కొబ్బరితోటకు చెందిన జగన్నాథ్ సాహూ(26) లను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెందుర్తి, అక్కిరెడ్డిపాలెంలలో పది కోళ్లను దొంగిలించిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల రమణ, నాగలూరి నాగరాజు, దొడ్డ ఈశ్వరరావులను అరెస్టు చేసినట్టు వారు తెలిపారు. సుజాతనగర్‌లో గల ఓ జ్యూస్ సెంటర్‌కు చెందిన స్టీల్ కౌంటర్‌ను చోరీ చేసిన చినముషిడివాడకు చెందిన కోనూరు రవిశంకర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఆయా కేసులను పెందుర్తి క్రైమ్ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేసి తక్కువ వ్యవధిలోనే నిందితులను పట్టుకుని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ ఎస్‌ఐ సూరిబాబు, సిబ్బంది నాగరాజు, ఎంఎస్ నాయుడు, శ్రీరామ్, భవానీ, శివప్రసాద్, దేవుడు, ఎల్ఎస్ నాయుడు, పైడిరాజులను ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన



పెదగంట్యాడ/గాజువాక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇటీవల పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ నాయకులు ఆదివారం నడుపూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ అంశాన్ని ప్రస్తావించిన రాహుల్‌గాంధీపై బీజేపీ ఎంపీలు దాడికి దిగడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ వర్మ, కొత్తపల్లి పెంటయ్య, టి.నగేష్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అపర్ణకు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అపర్ణ

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య కళాకారిణి అపర్ణ బెంగళూరు కూచిపూడి మరకతమణి సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు 2024 అందుకున్నారు. మధురవాడ పిలకవానిపాలెంకు చెందిన ఎస్ఎస్‌బీ అపర్ణ తన నృత్యకౌశల్యాన్ని ప్రదర్శించి ఇటీవల ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పలు అవార్డులు అందుకున్నారు. సుమారు 500 వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. 2008లో జనార్దనరావు, శ్రీదేవి దంపతులకు జన్మించిన ఆమె తొమ్మిదేళ్ల వయస్సులోనే కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభించారు. గత ఏడేళ్లుగా నృత్య ప్రదర్శనలిస్తూ కూచిపూడి నృత్య ప్రాశస్త్యాన్ని చాటారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, మ్యూజిక్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, ఎక్సలెన్సీ బుక్ ఆఫ్ రికార్డుల్లో తన పేరు నమోదు చేసుకున్నారు. నాట్యబాల పురస్కారం, నాట్య కుసుమల ప్రతిభా పురస్కారం, గరుడ కీర్తి పురస్కారం, నృత్య ప్రతిభా పురస్కారం ఇలా ఎన్నో అవార్డులు అందుకున్నారు. రామ్‌చరణ్ ట్రోఫీలో ప్రత్యేక జ్యూరీ అవార్డు, మిలన్ 2023, 2024లను కూడా తన సొంతం చేసుకుంది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంత్యుత్సవాల్లో పద్మశ్రీ చిరంజీవి చేతుల మీదుగా ప్రత్యేక సన్మానం పొందారు.

జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షుడిగా కొంకిపూడి రామకృష్ణ



జేసీఐ విశాఖవ్యాలీ అధ్యక్షుడు కొంకిపూడి రామకృష్ణ, సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ వ్యాలీ నూతన అధ్యక్షుడిగా కొంకిపూడి రామకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం సాయంత్రం ఆయన నగరంలోని లయన్స్ క్లబ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ అధ్యక్షుడు ఎ. సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కీ నోట్ స్పీకరుగా కేవీరావు, గౌరవ అతిథిగా జోనల్ ఉపాధ్యక్షుడు కేపీ కల్యాణ్, ప్రత్యేక అతిథులుగా రాంసూర్య కొల్లూరు, సిందూర తాడి హాజరయ్యారు. పదవీ స్వీకరణ అనంతరం ఈఏడాది జేసీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు అంశాలపై రామకృష్ణ మీడియాకు వివరించారు. అన్ని రంగాల వారికి సేవలందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు.

రవాణా శాఖ మంత్రికి ఎన్ఎంయూఏ సత్కారం



మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

ద్వారకా బస్‌స్టేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖా మంత్రి ఎం. రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఎన్ఎంయూఏ రాష్ట్ర, రీజనల్ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ విశాఖపట్నం డిపోలో నూతన బస్సుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొరను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం. సురేశ్‌నాయుడు, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు బి. నీలకంఠం, గండి రామకృష్ణ, జిల్లా కమిటీ చైర్మన్ ఫ్రాన్, డివిజన్ కార్యదర్శి ఏకే శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ అధ్యాపకునికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణప్రసాద్

వేపగుంట డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బోర్డు అక్రిడేటెడ్ ఇనిస్టిట్యూషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన మెడికల్ టీచర్స్ డే ఈవెంట్-2024లో శంకర్ ఫౌండేషన్ ఇనిస్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పల్లె కృష్ణప్రసాద్‌కు ఉత్తమ బోధన అధ్యాపకునిగా అవార్డు అందుకున్నారు. ఎన్సీఈఎంఎస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మిను బాజ్పాయ్ చేతుల మీదుగా కృష్ణప్రసాద్ అవార్డు అందుకోవడం అభినందనీయమని శంకర్ ఫౌండేషన్ మెనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణ పేర్కొన్నారు.

వెంకటాద్రిపై శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి శిఖరంపై నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారిని దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. అనంతరం తిరుప్పావైను పఠించి, గోదాదేవి ఎనిమిదో పాశురాన్ని స్వామికి నివేదించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే సరిపల్లిలో రామాలయంలో భక్తబృందం సీతారాముల విగ్రహాలతో కీర్తనలతో మేలుకొలుపు సంచారం చేశారు.



దుర్గానగర్ రోడ్డులో ఏర్పడిన భారీ గొయ్యి

గోతులు బాబోయ్ గోతులు!

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

గాజువాక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలోని గోతులు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోనే భారీ గోతులు ఏర్పడడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాజువాక వై-జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంటుకు వెళ్లే మార్గంలో దుర్గానగర్ కూడలి వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండా నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న గుంతగా ఉన్న ఈ గొయ్యి ఇప్పుడు పెద్ద గొయ్యిగా మారి ప్రమాదాలకు ఆలవాలంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ గోతిలో నీరు చేరడంతో వాహనదారులు గమనించిక దాని మీదుగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గోతిని పూడ్చాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకుడు జి.ఆనంద్ పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉక్కు'ను సందర్శించిన సఫాయి కర్మచారి సభ్యుడు



ఉక్కు కర్మాగారంలో మొక్క నాటుతున్న వావా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఆదివారం జాతీయ సఫాయి కర్మచారి సభ్యుడు వావా పర్యటించారు. ఉక్కు సీఎండీ ఏకే సక్సేనా, పలువురు డైరెక్టర్లు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్లాంటులోని పలు కీలక విభాగాలను సందర్శించారు. ఈడీ భవనంలో గల అవార్డు గ్యాలరీ, మోడల్ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంటులో సఫాయి కర్మచారీల కోసం చేపడుతున్న సంక్షేమంపై ఉక్కు యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కర్మచారీల కోసం చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. అనంతరం ఆయన ప్లాంటులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బాగ్చీ, పాండే, గణేశ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డు సమస్యలపై 'పల్లా'కు వినతి



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అగనంపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి బీసీ కాలనీ, తలారివానిపాలెంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్ ఆధ్వర్యంలో పలువురు ఆదివారం వినతిపత్రం అందజేశారు. బీసీ కాలనీలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, తలారివానిపాలెంలో గల గుండం చెరువును పరిరక్షించి, అభివృద్ధి చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.వసంతరావు, బాబ్జీ, రమణ, తలారి వాసు, నరసింగరావు, సిరి, దిలీప్, భవానీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణాపై నివేదిక ఇవ్వండి

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికల అక్రమ రవాణాపై నివేదిక ఇవ్వాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ రైల్వే పోలీసులను ఆదేశించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా వేరే ప్రాంతానికి తీసుకువెళ్తున్న తొమ్మిది మంది బాలికలను అక్రమంగా తరలిస్తున్నారా, ఉపాధి పనుల కోసం తరలిస్తున్నారా అన్న విషయమై సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని చెప్పారు. దీనిపై కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఉచిత పాటల శిక్షణ కేంద్రం ప్రారంభం

అగనంపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసాయినాథ్ సింగర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో కొండయ్యవలసలో గల సీడబ్ల్యూసీ ప్రాంగణంలో ఆదివారం ఉచితం పాటల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రూప్ ప్రతినిధులు మాట్లాడుతూ పాటలు పాడాలనే ఉత్సాహం ఉన్న యువతను అన్నివిధాలా ప్రోత్సహిస్తూ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆసక్తి గలవారు ఈమ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు వేణుగోపాలరావు, స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, జి.అప్పారావు, కె.పైడిరాజు, ఎం.ఉమామహేశ్వరరావు, లావణ్య, లీలావతి, కనకమహాలక్ష్మి, జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అడుగు వేస్తే బురదలో దిగిపోతుంది..

ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు, పాదచారులు



పైపులైన్ కోసం తవ్విన గోతిని నామమాత్రంగా పూడ్చివేసిన దృశ్యం

మల్కాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో ప్రధాన రహదారిలో పైపు లైన్ ఏర్పాటు కోసం సుమారు కిలోమీటరు మేర ఆరడుగుల లోతులో తవ్విన గొయ్యి వర్షాలకు చిత్తడి చిత్తడిగా మారింది. దీంతో ఇక్కడ అడుగు వేస్తే చాలు కాళ్లు బురదలోకి దిగిపోతున్నాయి. వాహనదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గాజువాక ఆర్టీసీ డిపో నుంచి అచ్చినాయుడు తోట టిడ్కో ఇళ్ల కోసం తాగు నీటి సరఫరా ప్రత్యేక విభాగం దాదాపు రూ.నాలుగు కోట్ల వ్యయంతో పైపు లైన్ ఏర్పాటు చేస్తున్నారు. నెల రోజులుగా ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. పైపుల ఏర్పాటు నిమిత్తం తరచూ గోతులు తవ్వుతున్నారు. అయితే ఆ పనులు పూర్తయ్యాక మొక్కుబడిగా మట్టితో పూడ్చివేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా గోతులమయంగా మారుతోంది. వర్షాలతో ఈ మార్గమంతా బురదమయంగా మారుతుంది. పొరపాటున ఎవరైనా దీనిమీదుగా వెళితే గోతిలో పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ గోతులను సక్రమంగా పూడ్చకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.